
నిలిచేదెవరో.. గెలిచేదెవరో!

వచ్చే ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థిత్వాల కోసం రెండు జిల్లాల్లో పలువురు రాజకీయ కుటుంబాల వారసులు రేసులో ఉన్నారు. వీరిలో ఇప్పటికే నలుగురు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులుగా ఉండగా.. మరో ఐదుగురు టికెట్ల కోసం పోటీ పడుతున్నారు. ఇప్పుడున్న రాజకీయ వాతావరణంలో వీరిలో ఎందరు ఆయా పార్టీల్లో టికెట్ సాధిస్తారో.. పోటీలో గెలిచి చట్టసభలో తొలిసారిగా అడుగుపెట్టి తమ కుటుంబ రాజకీయ వారసత్వాన్ని ఎందరు నిలబెట్టుకుంటారోనన్న ఆసక్తి ప్రజానీకంలో ఉంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



రెండు జిల్లాల నుంచీ టికెట్ల రేసులో తొమ్మిది మంది వారసులు

తిరుపతి జిల్లా నుంచి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తనయుడు అభినయ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మనవరాలు కీర్తి, చంద్రగిరిలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు మోహిత్‌రెడ్డి, సత్యవేడులో మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్, మాజీ మంత్రి కుతూహలమ్మ సోదరి కుమారుడు రాజేష్, సూళ్లూరుపేటలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి భర్త కృష్ణయ్య, తిరుపతి లోక్‌సభ స్థానంలో సత్యవేడు మాజీ ఎమ్మెల్యే తలారి మనోహర్ చిన్న కోడలు అంగలకుర్తి నీహారిక పేర్లు టికెట్ల రేసులో ప్రధానంగా వినిపిస్తున్నాయి. చిత్తూరు జిల్లాకు సంబంధించి చిత్తూరులో మాజీ ఎంపీ డీకే ఆదికేశవులు మనవరాలు చైతన్య, మాజీ మేయర్ కటారి అనురాధ కోడలు హేమలత పేర్లు ప్రచారంలో ఉన్నాయి.

ఇప్పటికే ఇన్‌చార్జులుగా నలుగురు

తిరుపతిలో భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరిలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, సత్యవేడులో రాజేష్.. ఈ ముగ్గురూ వైసీపీ తరఫున ఇన్‌చార్జులుగా కొనసాగుతున్నారు. వీరిలో మోహిత్‌రెడ్డిని ఆ పార్టీ ఇదివరకే రానున్న ఎన్నికల అభ్యర్థిగా ప్రకటించేసింది కూడా. ఈ ముగ్గురికీ వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఖాయమనే చెప్పాలి. ఏవైనా అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటే తప్ప వీరి పోటీలో మార్పులు ఉండకపోవచ్చు. ఒకవేళ అలాంటి పరిణామాలు తలెత్తితే దానికి సత్యవేడులోనే అవకాశం ఉంటుంది. టీడీపీ విషయానికొస్తే సత్యవేడులో మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్ ఇప్పటికే ఇన్‌చార్జిగా ఉన్నారు. కాకపోతే అభ్యర్థిత్వం విషయంలో అధిష్ఠానం ఎదుట మరిన్ని పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఇక్కడ అభ్యర్థి ఎవరన్నది తేలాలంటే మరికొన్ని రోజులు నిరీక్షించక తప్పదు. ఈ నలుగురూ ప్రధాన పార్టీల ఇన్‌చార్జులుగా ఉన్నందున ఇతరులతో పోలిస్తే వీరి అవకాశాలు ప్రబలంగానే ఉండనున్నాయి. ఇక, అభినయ్‌రెడ్డి గెలుపు కోసం కరుణాకరరెడ్డిరాజకీయంగా సానుకూల పరిస్థితులు సృష్టించుకునే ప్రయత్నంలో కొంతకాలంగా బిజీగా ఉన్నారు. మోహిత్‌రెడ్డి తండ్రి భాస్కర్‌రెడ్డి పంథాలోనే నిరంతరం జనం మధ్యే ఉంటున్నారు. సత్యవేడు వైసీపీకి రాజేష్ కొత్త వ్యక్తి. స్థానికేతరుడన్న ముద్ర పడుతోంది. పార్టీ శ్రేణులు ఎంతవరకూ అంగీకరిస్తాయన్నది చూడాలి. ఆదిమూలం అనుకూలవర్గం ఏం చేస్తుందనేది కూడా కీలకం కానుంది. అక్కడే టీడీపీ ఇన్‌చార్జి హెలెన్ ఇతర ఆశావహులతో పోలిస్తే ఇప్పటికే నియోజకవర్గమంతా కలియదిరిగేశారు. జనం మధ్యకు వెళుతున్నారు. ఈ నలుగురి అదృష్టం ఎలా ఉందో వేచి చూడాలి.

టికెట్ రేసులో మరో ఐదుగురు

- తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మనవరాలు కీర్తి బీటెక్ చదివారు. వివాహమై ప్రస్తుతం హైదరాబాదులో నివాసముంటున్నారు. ఆమె భర్త కూడా అన్నమయ్య జిల్లాలో పేరున్న రాజకీయ కుటుంబానికి చెందిన వారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్‌గా పోటీ చేయడం ద్వారా ఆమె రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. అప్పట్లో వైసీపీ నాయకులు అనుసరించిన దౌర్జన్యకర పద్ధతుల నడుమ గెలుపు సాధించలేకపోయారు. ఇపుడు టీడీపీ అసెంబ్లీ టికెట్ రేసులో ఉన్నారు. తనకు కాకపోతే మనవరాలికి టికెట్ ఇవ్వమని సుగుణమ్మ పట్టుబడుతున్నారు.
- రెండుమార్లు ఎంపీగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన పనబాక లక్ష్మి భర్త, ఐఆర్ఎస్ అధికారిగా రిటైరైన కృష్ణయ్య సూళ్లూరుపేట టికెట్ ఆశిస్తున్నారు. నిజానికి భార్యాభర్తలిద్దరూ ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఆశించినప్పటికీ ఒక కుటుంబానికి ఒకే టికెట్ విధానాన్ని పార్టీ అనుసరిస్తున్నందున ఒకరికే అవకాశం దక్కే పరిస్థితి. దీంతో కృష్ణయ్య అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు సమాచారం. నియోజకవర్గ టీడీపీ వర్గాల్లో కూడా ఆయన పేరు ప్రచారంలో ఉంది.
- తిరుపతి లోక్‌సభ స్థానం నుంచీ టీడీపీ టికెట్ రేసులో సత్యవేడు మాజీ ఎమ్మెల్యే తలారి మనోహర్ చిన్న కోడలు అంగలకుర్తి నీహారిక పేరు వినిపిస్తోంది. మాజీ ఐఏఎస్ అధికారి రత్నప్రభ కుమార్తె అయిన ఆమె అభ్యర్థిత్వాన్ని టీడీపీ అధిష్ఠానం సీరియస్‌గానే పరిశీలిస్తున్నట్టు సమాచారం. పార్టీ వర్గాల్లో అయితే దాదాపు ఆమె అభ్యర్థిత్వం ఖరారైపోయిందని, ప్రకటించడమే తరువాయి అన్న ప్రచారం నడుస్తోంది.
- చిత్తూరులో జనసేన టికెట్ రేసులో మాజీ ఎంపీ డీకే ఆదికేశవులు మనవరాలు చైతన్య పేరు వినిపిస్తోంది. ఆదికేశవులు పెద్ద కుమార్తె తేజస్విని కూతురైన చైతన్య శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ గురవయ్య నాయుడు కుమారుడు రాజేష్‌ను వివాహం చేసుకున్నారు. తాత, నాన్నమ్మ రాజకీయ వారసురాలిగా చిత్తూరు నుంచీ జనసేన టికెట్ సాధించి జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆమె గట్టిగా ప్రయత్నిస్తున్నారు. జనసేన అధిష్ఠానం కూడా ఆమె పేరును సీరియస్‌గానే పరిశీలిస్తున్నట్టు సమాచారం.
- చిత్తూరులోనే టీడీపీ టికెట్ రేసులో మాజీ మేయర్ హేమలత పేరూ బలంగా వినిపిస్తోంది. ఆమె మాజీ మేయర్ కటారి అనురాధ కోడలు. అనురాధ మృతితో కార్పొరేటరుగా గెలిచి మేయర్‌గా ఎన్నికయ్యారు. స్థానిక సంస్థలకు పరిమితమైన ఆమె రాజకీయ జీవితాన్ని ఇపుడు మరో మెట్టు పైకి చేర్చాలని యత్నిస్తున్నారు. అధిష్ఠానం పరిశీలిస్తున్న ఆశావహుల్లో ఆమె కూడా ఒకరు.

అలాంటి వారి నాలుకలు కోస్తా


- మంత్రి ఎదుటే ఎమ్మెల్యే వర్గీయులకు కట్టా వార్నింగ్
- సూళ్లూరుపేట వైసీపీలో విభేదాలు మరోసారి బట్టబయలు

తడ, ఫిబ్రవరి 4: సూళ్లూరుపేట వైసీపీలో వర్గవిభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎదుటే నాలుకలు కోస్తానంటూ ఎమ్మెల్యే వ్యతిరేక వర్గానికి చెందిన నేత అనడం చర్చనీయాంశమైంది. ఆదివారం నాయుడుపేట మండలం మేనకూరు సచివాలయం వద్ద జరిగిన పలు ప్రారంభోత్సవాలకు మంత్రి హాజరయ్యారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుకూల, వ్యతిరేక వర్గాలుగా వైసీపీ చీలిపోవడంతో ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తప్ప, ఆయన వర్గీయులంతా గైర్హాజయ్యారు. సమావేశంలో పాల్గొన్న వైసీపీ నాయకుడు కట్టా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ 3, 4 తరగతులు చదువుకున్న ఒకరికి ఎన్‌డీసీసీబీ చైర్మన్ పదవి కట్టబెడితే ఆయన వ్యవహారశైలి దారుణంగా ఉందని విమర్శించారు. కొంతమంది నాయకుల వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తోందని, అటువంటివారి నాలుకలు కోస్తానంటూ ఎమ్మెల్యే వర్గీయులను ఉద్దేశించి వ్యాఖ్యానించడంతో మరోసారి వర్గవిభేదాలు బయటపడ్డాయి. దీన్ని మంత్రి వారించకపోగా, ఇక్కడి వర్గ విభేదాలను సర్దుబాటు చేసేందుకు కృషి చేస్తానని చివరిలో అనడం విశేషం. ఇక సమావేశానికి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి.. ఎడముఖం, పెడముఖంగా వ్యవహరించారు.దీనిపైనా వైసీపీ శ్రేణుల్లో చర్చ జరిగింది.



ఐక్యతను చాటుతున్న నాయకులు

రేపు చిత్తూరు జిల్లాకు చంద్రబాబు రాక



వెదురుకుప్పం/గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 4: గంగాధరనెల్లూరు సమీపం రామానాయుడుపల్లె బస్టాప్ వద్ద మంగళవారం జరిగే 'రా.. కదలిరా' బహిరంగ సభ కోసం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. మధ్యాహ్నం 2.50 గంటలకు ఆయన రామానాయుడుపల్లె హెలిప్యాడ్‌కు వస్తారు. అక్కడ్నుంచి 3 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బహిరంగసభ జరుగుతుంది. అనంతరం 4.35 గంటలకు 4.45 రామానాయుడుపల్లె హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 5 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. 5.10 గంటలకు విమానంలో విజయవాడకు బయలుదేరుతారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఐదు స్థానాలివ్వాలి


లేకుంటే ఇండిపెండెంట్లుగా పోటీచేస్తాం

'సింహగర్జన'లో బీసీ జేఏసీ అధ్యక్షుడు

తిరుపతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాబోయే ఎన్నికల్లో బీసీలకు ఐదు అసెంబ్లీ సీట్లు కేటాయించాలి. లేకుంటే ఇండిపెండెంట్లుగా పోటీకి దిగుతాం' అని బీసీ జేఏసీ అధ్యక్షుడు అన్నా రామచంద్రయ్య యాదవ్ స్పష్టం చేశారు. గత ఏడాది డిసెంబరు ఏడో తేదీన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన బీసీ చైతన్య రథయాత్ర ఆదివారం తిరుపతిలో ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక ఇందిరామైదానంలో 'మరో స్వాతంత్ర్య పోరాటం కోసం సింహ గర్జన' పేరిట బహిరంగ సభ నిర్వహించారు. రామచంద్రయ్య మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు అవుతుందన్నారు. బీసీ నేత జీఆర్ నాగగోని మాట్లాడుతూ.. 75 శాతం బీసీలు రాజ్యాధికారానికి దూరమయ్యారన్నారు. కేవలం కులవృత్తులకే పరిమితం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోనేత వెంగళరావు యాదవ్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందే కానీ బీసీలకు రాలేదని వాపోయారు. బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు నాగమణి, నాగసత్యం, కరాటేకల్యాణి, నూకాలమ్మ, ఆవుల లక్ష్మణ్, స్థానిక బీసీ నేతలు పాల్గొన్నారు.

గ్రామం వదిలినా ఓటు తొలగించరా?

తొట్టంబేడు, ఫిబ్రవరి 4: తొట్టంబేడు మండలంలోని చిట్టత్తూరు గ్రామం వదిలి వెళ్లిన ఓ 35 మంది ఓట్లను జాబితా నుంచి తొలగించలేదు. సుబ్రమణ్యం, పార్వతమ్మ, పాండురంగం, చరణ్‌కుమార్ అనేవారు 20 ఏళ్ల కిందట గ్రామం విడిచిపెట్టి శ్రీకాళహస్తి పట్టణంలోని 9వ వార్డులో ఉంటున్నారు. అలాగే రాచగున్నేరికెళ్లిపోయిన చంద్రశేఖర్, హేమలత దంపతులతోపాటు పదేళ్ల కిందట వివాహమై చంద్రగిరిలో కాపురముంటున్న కోమల.. ఇలా గ్రామం విడిచిపెట్టిన 35 మంది ఓట్లు ఇంకా జాబితాలోనే ఉన్నాయి. ఈ ఓట్లను తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని టీడీపీ, జనసేన నాయకులు తెలిపారు.



20 ఏళ్ల కిందట ఊరొదిలిన వారు



రాచగున్నేరికి వెళ్లిన వారు



ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4: ముక్కంటి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులతో వేకువజాము నుంచే క్యూలైన్లో బారులు తీరారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ నలుమూలల నుంచి కూడా అధిక సంఖ్యలో విచ్చేశారు. రూ.200 శీఘ్ర దర్శనం టికెట్లు 1758, రూ.50 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు 3,272 భక్తులు కొనుగోలు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 27వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

తిరుపతిలో.. అంబాజీపేట మ్యారేజి బ్యాండు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 4: తాము నటించిన అంబాజీపేట మ్యారేజి బ్యాండు చిత్రానికి మంచి ఆదరణ లభిస్తోందని హీరో సుహాస్, హీరోయిన్ శివాని వెల్లడించారు. దర్శకుడు దుష్యంత్, నిర్మాత ధీరజ్‌తో కలిసి వారు తిరుపతిలోని ప్రతాప్ థియేటర్‌ను ఆదివారం రాత్రి సందర్శించారు. థియేటర్‌లో ప్రేక్షకుల స్పందన చూసి సంతోషం వ్యక్తం చేశారు. కర్నూలు, కడప థియేటర్లను సందర్శించామని, అక్కడ కూడా పూర్తి సామర్థ్యంతో సినిమాను ఆదరిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా సెల్ఫీలు తీసుకునేందుకు అభిమానులు పోటీపడ్డారు. గ్రూప్ థియేటర్స్ ఓనర్ సతీష్, మేనేజర్లు కృష్ణ, ప్రభాకర్ వారి వెంట ఉన్నారు.

10వరకు ఇంటర్ తత్కాల్ ఫీజు గడువు పొడిగింపు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 4: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు (ప్రథమ, ద్వితీయ) హాజరయ్యే విద్యార్థులకు తత్కాల్ ఫీజు గడువును ఈనెల 10వ తేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటివరకు పరీక్ష ఫీజు చెల్లించని రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు రూ.3వేల అపరాధ రుసుంతో ఈనెల 10న సాయంత్రం ఐదు గంటల్లోపు ఆన్‌లైన్‌లో చెల్లించే వెసులుబాటు కల్పించారన్నారు. దీన్ని విద్యారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలకు భవనాల పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 4: ఈవీఎంలను భద్రపరిచేందుకు అవసరమైన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల కోసం అవసరమైన భవనాలను కలెక్టర్ లక్ష్మీశా ఆదివారం పరిశీలించారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలోని పలు భవనాలు, అందులోని గదులను ఆయన చూశారు. ప్రత్యేకించి ఇంజనీరింగ్ కాలేజీ భవనాలను పరిశీలించారు. జేసీ శుభం బన్సల్, ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ అశోక్‌రెడ్డి, ఆర్ఎస్‌డీటీ రామచంద్రారెడ్డి ఆయన వెంట ఉన్నారు.

బ్రాడ్‌కాస్టింగ్ కార్యాలయానికి దారేది?

- మిస్సింగ్ ప్రకటనలకు భక్తుల ఇక్కట్లు

తిరుమల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో తప్పిపోయిన తమ వారి ప్రకటనల కోసం భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. హిందూ ధర్మ ప్రచారం, పరిరక్షణ కోసం తిరుమలలోని ఆస్థాన మండపంలో శనివారం నుంచి ధార్మిక సదస్సు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో స్వామీజీలు, అధికారుల కార్లను ఆస్థానమండపం పక్కనే ఉన్న బ్రాడ్‌కాస్టింగ్ కార్యాలయం ముందు పార్కింగ్ చేస్తున్నారు. దాంతో బ్రాడ్‌కాస్టింగ్ కార్యాలయం వైపు భక్తులను రానీయకుండా సిబ్బంది చర్యలు తీసుకోవడంతో తప్పిపోయిన తమ వారి వివరాలను మైకుల ద్వారా ప్రచారం చేసేందుకు వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. బ్రాడ్ కాస్టింగ్ కేంద్రం వరకు వెళ్లలేక, తమ వారు ఎక్కడున్నారో తెలుసుకోలేక అగచాట్లు పడుతున్నారు. కొందరు పోలీస్‌స్టేషన్‌కు, మరికొందరు సీసీ కెమెరా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వెళుతున్నారు.



బ్రాడ్‌కాస్టింగ్ కేంద్రం ముందు నిలిపి ఉన్న కార్లు



సమావేశంలో ప్రసంగిస్తున్న బాలాజి

ఇక టీచర్ల పోరాటం

● సన్నద్ధం కావాలని ఆపస్ పిలుపు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 4: రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సన్నద్ధం కావాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజి పిలుపునిచ్చారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో ఆదివారం జరిగిన సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. టీచర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా దాటవేత ధోరణి ప్రదర్శిస్తోందని, ఉద్యమ కార్యాచరణ చేపట్టక తప్పదని అన్నారు. ప్రతిపక్షనేత హోదాలో సీఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్‌ని రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలని పలుమార్లు కోరామని, అయితే బలవంతంగా జీపీఎస్‌ని ప్రవేశపెట్టారని వాపోయారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. కరువుభత్యం, మధ్యంతర భృతి ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. రాష్ట్రీయ సైనిక్ మహాసంఘ సంఘటన కార్యదర్శి శ్రావణ్‌కుమార్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ క్షేత్రప్రచారక్ భరత్‌కుమార్ మాట్లాడారు. అఖిల భారత రాష్ట్రీయ సైనిక్ మహాసంఘ జాతీయ సంఘటన మంత్రి మహేంద్రకపూర్, సహ కార్యదర్శి రాజశేఖర్‌రావు, ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసలు



టీడీపీలో చేరినవారితో పులివర్తి నాని

తిరుచానూరు, ఫిబ్రవరి 4: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో పలువురు తెలుగుదేశం పార్టీలో చేరారు. తిరుపతి రూరల్ మండలం రణధీరపురం పంచాయతీకి చెందిన 25 కుటుంబాలకు చెందిన రామచంద్రయ్య, మాధవ, డి.వెంకటరమణ, ఖాసీమ్‌ఖాన్, రాజు, సుబ్బరాయుడు, నాగయ్య, బాబు, మహమ్మత్ ఖాన్, చిట్టిబాబు, అరుణ్‌కుమార్, వెంకటరమణ, మునికృష్ణ, అంజనయ్య, ఎస్.ఆనందయ్య, జి.రమేష్, సుబ్రహ్మణ్యం ఆదివారం పార్టీలో చేరారు. ప్రభుత్వ విధ్వంసపాలనకు చరమగీతం పాడి పులివర్తి నానీని ఎమ్మెల్యే చేసేందుకు తాము పనిచేస్తామని వారు తెలిపారు. రాష్ట్రం కోసం, యువత భవిష్యత్ కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్‌రెడ్డి, సీఆర్ రాజన్, ఈశ్వరయ్య, గోపీనాథ్, సురేష్‌కుమార్, బాలచంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

దళిత ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దగ్ధం..దళిత జాతికే అవమానం

నాగలాపురం, ఫిబ్రవరి 4: దళిత ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దగ్ధం దళిత జాతికే అవమానమని పలువురు యువకులు పేర్కొన్నారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దిష్టిబొమ్మను సొంత పార్టీ నాయ కులే ఇటీవల దగ్ధం చేసిన విషయం తెలిసిందే. ఈ సంద ర్భంగా ఆదివారం పిచ్చాటూరు మండలంలోని యువకులు స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిమూలానికి అన్యాయం జరిగితే అడ్డుకోవాల్సిన దళితలు ఆయన దిష్టిబొమ్మలను దగ్ధం చేయడం అత్యంత దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది నాగరాజ్ పాండియన్, రుకేష్, ఎమ్మెస్ రవి. ఎంరవి, ఏకాంబరం, శైలేషన్, జామవా, రమేష్ పాల్గొన్నారు.

గంజాయి వాడకంలో చంద్రగిరి ఫస్ట్

● ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్



మత్తు పదార్థాల వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ

చంద్రగిరి, ఫిబ్రవరి 4: గంజాయి వాడకంలో రాష్ట్రంలోనే చంద్రగిరి నియోజకవర్గం తొలిస్థానంలో ఉందని ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ ఆరోపించారు. ఆదివారం ప్రపంచ క్యాన్సర్ దినాన్ని పురస్కరించుకుని మత్తు పదార్థాల వాడకంతో కలిగే అనర్థాలపై సుమారు 10వేల మందితో చంద్రగిరిలో ఆయన అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొండవాడ సమీపంలోని ఉగ్రప్రత్యంగిరాదేవి ఆలయం నుంచి చంద్రగిరి టవర్‌క్లాక్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చంద్రగిరి నియోజకవర్గాన్ని గంజాయిరహితం చేయాలని డిమాండ్ చేశారు. కాగా.. ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రూరల్ హెల్త్ సెంటర్‌లో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అధ్యక్షతన, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్ సహకారంతోనూ ర్యాలీ జరిగింది.

చిన్నపిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు



పాకాల, ఫిబ్రవరి4: దామలచెరువులో ఆదివారం టీడీపీ నేత పులివర్తి నాని కోడలు డాక్టర్ త్రిష్యరెడ్డి ఆధ్వర్యంలో చిన్నపిల్లల మెగా వైద్యశిబిరం నిర్వహించారు. 14 ఏళ్లలోపు పిల్లలు 500 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఏడుగురు వైద్యుల బృందం వైద్య సేవలు అందించారు. హెల్త్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా పులివర్తి సుధారెడ్డి మాట్లాడుతూ పాకాల మండలంలో పూర్తిస్థాయి వసతులతో ఆస్పత్రి లేదని, ఉన్న పీహెచ్‌సీలలో వైద్యులు, మందులు అందుబాటులో లేవని ఆరోపించారు. పిల్లలకు ఏ ఆరోగ్య సమస్య తలెత్తినా పీలేరు, చిత్తూరు, తిరుపతివైపు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

పదవీ విరమణ సన్మానం



పాకాల, ఫిబ్రవరి 4: దామలచెరువు హైస్కూల్‌లో తెలుగు పండితుడిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఎం.చంద్రశేఖర్ నాయుడిని ఘనంగా సన్మానించారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇరంగారిపల్లెలో జల్లికట్టు



పాకాల, ఫిబ్రవరి 4: మండలంలోని ఇరంగారిపల్లెలో ఆదివారం పశువుల పండుగ ఘనంగా నిర్వహించారు. కోడె గిత్తలను అందంగా ముస్తాబు చేసి కొమ్ములకు రంగులు వేసి పలకలు కట్టి పూజలు నిర్వహించారు. గ్రామంలో కోలాహలంగా జల్లికట్టు నిర్వహించారు. కోడెగిత్తలను పట్టుకొని బహుమతులు దక్కించుకోవడానికి యువకులు వాటివెంట పరుగులు తీశారు. జల్లికట్టు తిలకించడానికి పరిసర గ్రామాల నుంచి వచ్చి ప్రజలతో గ్రామం జనసంద్రమైంది.



నృత్యం అదుర్స్

తిరుచానూరు, ఫిబ్రవరి 4: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం రాత్రి జరిగిన నృత్య ప్రదర్శన అలరించింది. తిరుపతి నగరం పుష్ప డ్యాన్స్ అకాడమీకి చెందిన పుష్ప ఆధ్వర్యంలో చిన్నారులు మన్నశ్రీ, మహతి, యాషిక, నిహారిక, పూజాశ్రీ, తేజస్వి, సాయిసుప్రజ, హిమకార్తికేయ, విద్యాశ్రీ, కీర్తిక, హిమశ్రీ పలు అన్నమయ్య కీర్తనలకు చేసిన భరత నాట్య ప్రదర్శన ఆహూతులను మైమరపించింది. వీరికి ఏవో ఖాదరవల్లి జ్ఞాపికలు అందజేశారు.

వేడుకగా శక్తి చాముండేశ్వరీదేవి కుంభాభిషేకం



తిరుపతి రూరల్, ఫిబ్రవరి 4: తుమ్మలగుంటలోని శక్తి చాముండేశ్వరీదేవి కుంభాభిషేక మహోత్సవం అత్యంత వేడుకగా సాగింది. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, ప్రత్యేక అలంకరణ, హోమం నిర్వహించారు.అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉభయదారులు బీరుదాల భాస్కరరెడ్డి, హరితారెడ్డి, కరిష్మారెడ్డి, హర్షిత్‌రెడ్డి, రామతులసిరెడ్డి, నాగమునిరెడ్డి, అనిత, లక్ష్మి, భారతి పాల్గొన్నారు.

ప్రగతే లక్ష్యం

చంద్రగిరి, ఫిబ్రవరి 4: ప్రగతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొటాల, చిన్నరామాపురం, కందులూరిపల్లి, ఎ.రంగంపేట, పంచాయతీలలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం





హాజరైన మహిళలు - సభలో మాట్లాడుతున్న పులివర్తి నాని

● చంద్రగిరి అభివృద్ధి కోసం ఒక్క అవకాశం ఇవ్వండి
● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని
● 'జయహో బీసీ'కి జనసేన మద్దతు

తిరుచానూరు, ఫిబ్రవరి 4: బీసీల అభ్యున్నతే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తుందని ఆ పార్టీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. తిరుపతి రూరల్ మండలం తనపల్లె వద్దనున్న రామానాయుడు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. బీసీల రక్షణ కోసం చంద్రబాబు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకువస్తున్నారని చెప్పారు. చంద్రగిరి నియోజకవర్గంలో నిరుద్యోగులు ఎక్కువగా ఉన్నారని చెప్పారు. చంద్రబాబు సీఎం అయ్యాక రేణిగుంటలో పరిశ్రమలు స్థాపించి, అందరికీ ఉద్యోగావకాశాలు కల్పించే బాధ్యత తీసుకుంటానన్నారు.

దోచుకున్న డబ్బుతో స్థలాలు కొంటున్న ఎమ్మెల్యే

ప్రస్తుత ఎమ్మెల్యే.. ఎర్రచందనం, ఇసుక అక్రమ రవాణా, భూ ఆక్రమణలు, మఠం భూముల అన్యాక్రాంతంతోపాటు బిల్డర్స్, కాంట్రాక్టర్లను బెదిరించి అడ్డగోలుగా సంపాదించారని నాని ఆరోపించారు. ఇలా దోచుకున్న డబ్బుతో వైజాగ్, హైదరాబాద్, అమరావతిలో భూములు కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. తుడా నిధులతో నియోజకవర్గ వ్యాప్తంగా సిమెంటు బల్లలు వేశారని, అందులో భారీ అవినీతికి పాల్పడ్డరన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తనకు ఓ అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమానికి జనసేన నేతలు దేవర మనోహర్, వెంకట్ తదితరులు మద్దతుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీఆర్ రాజన్, ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, శ్రీనివాసులు, మునిరత్నంరెడ్డి, పత్తి సుధ, కిషోర్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, వాసు, హరేరామ్, జనార్థన్, సాయిరాయల్, రాజా, కార్యకర్తలు పాల్గొన్నారు.

జపాన్‌లో శ్రీసిటీ మార్కెటింగ్ బృందం సమావేశాలు



జెట్రో ప్రతినిధులతో శ్రీసిటీ అధికారులు

శ్రీసిటీ, ఫిబ్రవరి 4: భవిష్యత్‌లో శ్రీసిటీ-జపాన్ వ్యాపార బంధం మరింత బలోపేతం అయ్యే దిశగా శ్రీసిటీ మార్కెటింగ్ బృందం చొరవ చూపుతోంది. గత వారం టోక్యో ఆటోమోటివ్ వరల్డ్ ఎక్స్‌పోలో పాల్గొనడంతోపాటు ప్రస్తుతం జపాన్‌లో పర్యటిస్తూ చురుగ్గా.. మార్కెటింగ్ ప్రణాళికలను అనుసరిస్తోంది. ఇందులో భాగంగా జపాన్‌లో భారత రాయబారి సీబీ జార్జ్‌తో నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు (పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు) ఆర్.వీరారెడ్డి, జమైకాలోని జపాన్ మాజీ రాయబారి, శ్రీసిటీకి సలహాదారు మసనోరి నకనో శ్రీసిటీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) గోపికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ప్రస్తుతం 28 దేశాలకు చెందిన 210 కంపెనీలు శ్రీసిటీలో ఏర్పాటు అయ్యాయని, అందులో జపాన్ దేశ పరిశ్రమలు 30 ఉన్నట్లు చెప్పారు. శ్రీసిటీ భారతదేశంలో రెండో అతి పెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చురుకైన పారిశ్రామిక విధానాల ఫలితంగా శ్రీసిటీ మరింత వేగవంతమైన పురోగతిని సాధిస్తూ ప్రధాన పెట్టుబడి గమ్యస్థానంగా మారిందంటూ భారత రాయబారి ప్రశంసించారు. ఇంకా జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో), మినిస్ట్రీ ఆఫ్ ఎకానమీ, ట్రేడ్, ఇండస్ట్రీ(మెటీ)లకు చెందిన సీనియర్ ప్రతినిధులతో సైతం శ్రీసిటీ అధికారులు సమావేశమై చర్చించారు. జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లో చేపడుతున్న పనులు, శ్రీసిటీలోని జపాన్-ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఫర్ మాన్యుఫ్యాక్చరింగ్ (జిమ్) పనితీరు, ఇతర వ్యాపార వ్యవహారాలపై వీరు ప్రధానంగా చర్చలు జరిపారు. ఎస్ఎంబీసీ బ్యాంకు, మిజుహో బ్యాంకు, జపాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సమావేశమై పెట్టుబడులు, ఇతర అంశాలపై చర్చించారు. శ్రీసిటీ ప్రయత్నాలు మంచి ఫలితాలను సాధిస్తాయని, జపాన్‌తో శ్రీసిటీ వ్యాపార బంధం మరింత బలోపేతం అవుతుందంటూ శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.

కె.సభా సంకలనాలను అందిస్తే పుస్తకాలుగా ప్రచురిస్తాం

కె.సభా శత జయంత్యుత్సవాల్లో కేంద్ర సాహిత్య అకాడమీ కన్వీనర్ మృణాళిని



రచయిత్రి మృణాళినిని సత్కరిస్తున్న జిల్లా రచయితల సంఘం, నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 4: నాటి సంస్కృతి, సాంఘికత్వం, జీవన విధానానికి తన రచనల్లో కె.సభా రూపురేఖలు కల్పించి జిల్లా ఖ్యాతిని చాటారని కేంద్ర సాహిత్య అకాడమీ కన్వీనర్ మృణాళిని పేర్కొన్నారు. ప్రముఖ రచయిత, సంపాదకుడు, ప్రచురణకర్త కె.సభా శత జయంత్యుత్సవాలను నిర్వహించడం కేంద్ర సాహిత్య అకాడమీకి మణిహారం లాంటిదన్నారు. చిత్తూరులోని కట్టమంచి బాలకృష్ణారెడ్డి మ్యాంగో భవన్‌లో ఆదివారం కేంద్ర సాహిత్య అకాడమీ, జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కె.సభా శత జయంత్యుత్సవాల్లో ఆమె మాట్లాడారు. ఆయన సాహిత్య సంకలనాలను సేకరించి అకాడమీకి అందజేస్తే, వాటిని పుస్తకాలుగా ప్రచురిస్తామని చెప్పారు. సభా రచనల పట్ల పరిశోధనలు చేసే వారికి అకాడమీ ఆర్థిక సహకారం అందిస్తుందని ఆమె తెలిపారు. రాయలసీమ తొలి కథా రచయితగా పేరు పొందిన కె.సభా.. సామాజిక, ఆర్థిక, సాంఘిక అంశాలను తనదైన రీతిలో, తగు మాండలీకాల్లో రచించి వన్నె తెచ్చారని ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మధురాంతకం నరేంద్ర అన్నారు. ఆయన 290కి పైగా కథలు రాస్తే కేవలం 40 మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. సభా పుట్టిన రోజే ఆయన కుమారుడు రమణ వర్ధంతి రోజు కూడా కావడం బాధాకరమని కిరణ్ క్రాంత్ చౌదరి పేర్కొన్నారు. నీటిదీపాలు, బంగారమ్మ కథల్లో ఇరుగు పొరుగు సంభాషణలను అతి చక్కగా, సరళమైన భాషలో రచించారని ఎస్వీయూ తెలుగు అధ్యయన శాఖాధిపతి రాజేశ్వరమ్మ వివరించారు. చిన్నారుల మానసిక వికాసానికి, విజ్ఞానికి రచనలు చేసి మెప్పించిన రచయితల్లో మొదటి వారి సభా అని నేషనల్ బుక్ ట్రస్టు సభ్యుడు పత్తిపాటి మోహన్ అన్నారు. పలమనేరు బాలాజి మాట్లాడుతూ.. సభా కవితలు ఎంతో సరళమైన పదాలతో ఉండి అన్ని వర్గాల వారిని ఆలోచింప చేస్తాయన్నారు. జొన్న విత్తుల శ్రీరామచంద్రమూర్తి, ఎంఆర్ అరుణకుమారి, ఉర్దూ రచయిత కాసీం అలీ ఖాన్, కట్టమంచి బాలకృష్ణారెడ్డి, డాక్టర్ కె.రామలక్ష్మి, కె.వేణుగోపాల్, పసతల హరికృష్ణారెడ్డి, సామాజిక కార్యకర్త అశోక్ కుమార్ తమ ప్రసంగాల్లో సభా సాహితీ సేవలను కొనియాడారు. సభా కుటుంబ సభ్యులను నిర్వాహకులు సన్మానించారు. రచయిత్రి మృణాళిని కూడా సత్కరించారు.

సొసైటీల్లో కమిటీల పాలనే

● మరో ఆరునెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు ● ఐదేళ్లుగా ఎన్నికలకు చొరవ చూపని ప్రభుత్వం

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 4: రైతుల భాగస్వామ్యంతో సహకార సంఘాలు పనిచేయాలి. అయితే వారి భాగస్వామ్యం లేకుండా, సంఘాల్లో వారి పాత్రను దూరం చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోంది. ఈ క్రమంలో మరో ఆరు నెలలు త్రిసభ్య కమిటీల ఆధ్వర్యంలోనే ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల (సింగిల్ విండోలు) కార్యకలాపాలు జరగనున్నాయి. ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలతో ప్రభుత్వ పాలన సాగిస్తోంది. ఐదేళ్లుగా సహకార ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చొరవ చూపడంలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక సింగిల్ విండోల్లో త్రిసభ్య కమిటీల పాలనను కొత్తగా ప్రవేశపెట్టింది. ప్రతి ఆరు నెలలకు ఓసారి ఈ కమిటీల పదవీ కాలాన్ని కొనసాగిస్తూ వస్తోంది. తాజాగా ఉమ్మడి జిల్లాలోని 76 సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీల పదవీ కాలం జనవరి 31వ తేదీతో ముగిసింది. ఫిబ్రవరి 1 నుంచి జూలై 31 వరకు ఆ కమిటీల పదవీకాలం పొడిగిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. మంత్రి పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే త్రిసభ్య కమిటీల సభ్యుల నియామకాలను సహకారశాఖ చేస్తోంది.కాగా, ప్రస్తుతం ఐరాల కమిటీ చైర్మన్‌ను మార్పు చేసింది. రాజకీయాలకు అతీతంగా సింగిల్ విండోలు పనిచేయాల్సివుండగా, మితిమీరిన రాజకీయ జోక్యం ఉంటోంది. దీంతో తీవ్ర అన్యాయం జరుగుతోందని రైతులు వాపోయారు.

2013లో సహకార ఎన్నికలు

సింగిల్ విండోలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. వాటి గడువు 2018లో ముగిసింది. అప్పటినుంచి ఎన్నికలు జరుగలేదు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం సొసైటీల అధ్యక్షుల పదవీకాలాన్ని 2019 వరకు పొడిగించింది. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎన్నికలు ఉంటాయని అందరూ భావించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటరు జాబితాను కూడా అధికారులు సిద్ధం చేశారు. రూ.10 నుంచి రూ.300 వరకు చెల్లించిన ఓటర్ల సంఖ్య సుమారు ఐదు లక్షలకు పైగా ఉంది. తొలుత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించినా.. ఆ తర్వాత చొరవ చూపలేదు. అందుకు బదులుగా త్రిసభ్య కమిటీల పాలనను సింగిల్ విండోల్లో ప్రవేశపెట్టింది. ఎన్నికలు లేకపోవడంతో కొన్ని సింగిల్ విండోల్లో త్రిసభ్య కమిటీలు అక్రమాలకు తెరతీశాయన్న ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని చోట్ల రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయన్న విమర్శలున్నాయి.

బదిలీ వేటుకు తర్జనభర్జన

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి4: బాలుడు అర్ధరాత్రి శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రాకారం దాటడంలో ముమ్మాటికి భద్రతా వైఫల్యమే కారణమని అధికారులు తెలిపినట్లు సమాచారం. ఈ ఘటనపై శనివారం అధికారులు రహస్యంగా విచారించారు.భద్రత డొల్లతనంపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు.కొందరు ఉద్యోగులపై బదిలీ వేటుకు తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జయరామనాయుడు

పాకాల, ఫిబ్రవరి 4: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్.శంకర్ కోరారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు.నాయకులు మాట్లాడుతూ సకాలంలో పెన్షన్లు చెల్లించాలని, పీఆర్సీ, డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండు చేశారు.అనంతరం సీనియర్ పెన్షనర్లు 35మందిని సన్మానించారు.జిల్లా ప్రధాన కార్యదర్శి జయరామ నాయుడు,జిల్లా కోశాధికారి సిద్దయ్య,పాకాల సంఘం అధ్యక్షుడు పీఆర్ మునస్వామి, ప్రధాన కార్యదర్శి ఎం.కుప్పుస్వామి,జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 4: కాణిపాకం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి స్వామి దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు కాణిపాకానికి విచ్చేయడంతో ఆలయం పూర్తిగా నిండి పోయింది. దీంతో స్వామి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

రైల్లో నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి



తడ, ఫిబ్రవరి 4: ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారిపడి ప్రయాణికుడు మృతి చెందాడు. శనివారం రాత్రి సమయంలో చెన్నై నుంచి సూళ్లూరుపేటకు వెళ్తున్న సబర్బన్ రైలు నుంచి సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ వ్యక్తి రైలు దిగుతూ ప్రమాదవశాత్తు జారి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్టేషన్ సిబ్బంది 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతని వద్ద చెన్నై అత్తిపట్టు నుంచి సూళ్లూరుపేట వరకు తీసుకున్న టికెట్ మాత్రమే లభ్యమైంది. ఇతర వివరాలు ఏవీ తెలియలేదు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధర్మపరిరక్షణకు నడుం బిగించాలి



● ధార్మిక సదస్సులో స్వామీజీలు

తిరుమల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సనాతన హిందూ ధర్మపరిరక్షణకు అందరూ నడుం బిగించాలని మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థస్వామిజీ పిలుపునిచ్చారు. తిరుమలలో జరుగుతున్న ధార్మిక సదస్సులో భాగంగా రెండో రోజు ఆయన మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మవ్యాప్తికి టీటీడీనే పునాది అన్నారు. ధర్మప్రచారం కోసం టీటీడీ వేలకోట్లు వెచ్చిస్తున్నా కొంతమంది ఉద్దేశపూర్వకంగా తప్పుపట్టడం సరికాదన్నారు. దేశంలోని ఇతర మతస్థులకు కూడా మన సంప్రదాయాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంప్రదాయల పరిరక్షణ కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పుష్పగిరి మఠాధిపతి విద్యాశంకర భారతిస్వామి అన్నారు. ఉడిపి అదమారు మఠాధిపతి ఈశప్రియ తీర్థస్వామిజీ అనుగ్రహభాషణం చేస్తూ హిందువులు వేదాలు, ఉపనిషత్తులకు సంబంధించిన జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఇతిహాస పురాణాలు యువత సన్మార్గంలో పయనించడానికి సహాయపడతాయని పుత్తిగె మఠాధిపతి సుగుణేంద్రతీర్థస్వామిజీ అన్నారు. విద్యార్థులకు ధర్మాన్ని బోధించే విధంగా పాఠ్యాంశాలు ఉండాలని, యోగసాధన శారీరక, మానసిక వికాసానికి ఉపయోగపడుతుందని ఉత్తరాధి మఠాధిపతి విద్యాధీశ తీర్థస్వామీజీ అన్నారు. విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ కార్యదర్శి రాఘవులు మాట్లాడుతూ పారాయణాల్లో మహిళల్ని భాగస్వాములు చేయాలన్నారు. శ్రీపాదరాజ మఠాధిపతి సుజనయనిధి తీర్థస్వామీజీ మాట్లాడుతూ యువత, బాలల్లో ధార్మిక ప్రచారం కోసం ఒక్కో స్వామీజీ ఒక్కో జిల్లాను దత్తత తీసుకోవాలని సూచించారు. ఉత్తరాఖండ్‌కు చెందిన జ్యోతిర్‌మఠాధి ముకుందానంద మహరాజ్ మాట్లాడుతూ గోమాతను విశ్వమాతగా ప్రకటించాలన్నారు. మన్నార్ గుడి శాంతాలంకార షెన్ భాగమన్నార్ జీయర్ స్వామి మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మత మార్పిడులను నివారించడానికి టీటీడీ కృషి చేయాలన్నారు. ఉడిపి కన్నూర్ మఠాధిపతి విద్యావల్లభతీర్థ స్వామీజీ మాట్లాడుతూ వేద అధ్యయనం చేస్తున్న విద్యార్థులకు మరింత ఆర్థిక సహాయం చేయాలన్నారు. బెంగళూరుకు చెందిన విద్యా విజయతీర్థ స్వామీజీ మాట్లాడుతూ విద్య, వైద్యానికి సంబంధించి టీటీడీ మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ఇంత సంఖ్యలో అనుగ్రహభాషణం శుభసూచికం : జీయర్‌స్వాములు

దేశవ్యాప్తంగా ఉన్న స్వామీజీలు ఆయా సంప్రదాయాల్లో ధర్మప్రచారం చేస్తున్నారని, వారి విలువైన సూచనలు తీసుకుని టీటీడీ మరింతగా ధర్మప్రచారం చేస్తుందని తిరుమల పెద్ద, చిన్నజీయర్‌స్వాములు అన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో స్వామిజీలు పాల్గొనడం శుభసూచికమన్నారు.


ఉన్న ఆలయాల్లో ధర్మ పరిరక్షణ చేయాలి

తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది ఆలయాలున్నాయని, వాటిలో ధర్మరక్షణ కోసం అర్చకులను భాగస్వాములను చేయాలని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు సౌందర్యరాజన్ రంగరాజన్ అన్నారు. తిరుమలలో నూతన కట్టడాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కమలానంద భారతి స్వామి కోరారు. శ్రీవారి సేవకు ముస్లిం భక్తులను అనుమతించాలన్న ఈవో నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

సదస్సు విజయవంతం : ఈవో

తిరుమలలో జరుగుతున్న ధార్మిక సదస్సుకు 57 మంది స్వామిజీలను ఆహ్వానించగా అందరూ ప్రత్యక్షంగా, పరోక్షంగా అనుగ్రహభాషణం అందించారని, ఈ విధంగా సదస్సు విజయవంతమైందని టీటీడీ ఈవో ధర్మారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

ఘనంగా గాయత్రి జపం



గాయత్రి జపం చేస్తున్న జపతులు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 4 : కపిలతీర్థం సమీపంలోని రాధామాధవ మందిరంలో ఆదివారం సామూహిక సంధ్యావందనం, గాయత్రి జప కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం హైదరాబాదుకు చెందిన కె.సి.దాస్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉదయం 6నుంచి 9గంటల వరకు జపతులు ఈ కార్యక్రమాలను ఆచరించారు. జపతులకు సామగ్రి, పుస్తకాలను అందజేశారు. తిరుపతి జోన్ కో ఆర్డినేటర్ ఖండవల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



పొంగులేటి సుధాకర్‌రెడ్డి - శ్రీహరి

తిరుమల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో బీజేపీ నేత పొంగులేటి సుధాకర‌రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరి ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్వామిని దర్శించుకున్నారు. పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్పం నెరవేరాలంటే బీజేపీ మరోసారి అధికారంలోకి రావాలన్నారు. ప్రధాని మోదీకి శ్రీవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్టు చెప్పారు. ఎవరి ధర్మాలు, ఎవరి ఆచారాలు వారివని, కానీ తమిళనాడులో సనాతన ధర్మంపై డీఎంకే స్టాలిన్ ఎలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు.. ఎలా దాడి చేస్తున్నారో అందరు చూస్తున్నారని అన్నారు. స్టాలిన్ వ్యాఖ్యలను దేశం మొత్తం ఖండిస్తోందన్నారు. సనాతన హిందూ ధర్మం చాలా గొప్పదన్నారు. రాష్ట్రంలో జనసేన పార్టీతో పొత్తు కొనసాగుతుందని, భవిష్యత్తులో ఎవరితో కలిసి ఎన్నికలకు వెళ్లాలనే విషయాన్ని హైకమాండ్ నిర్ణయిస్తుందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.



నేటి నుంచి టీటీడీ ఉద్యోగుల ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 4: టీటీడీ ఉద్యోగుల ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభంకానున్నట్లు టీటీడీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీర్లకిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మార్‌పల్లి పోలీసుస్టేషన్ వద్దనున్న రిజిస్ట్రేషన్ కార్యాలయంలో టీటీడీ లైజన్ ఆఫీసర్ స్నేహలత, వెల్ఫేర్ ఆఫీసర్ ప్రశాంతి, డిప్యూటీ ఈవో విజయలక్ష్మి అందుబాటులో ఉంటారని తెలిపారు.50అంకణాల స్థలం విలువ రూ.2,99,483తోపాటు ఫీజు రుసుం రూ.24,650 చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.ఉద్యోగులు వ్యక్తిగతంగా హాజరై రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

సుగుణమ్మ 'సెల్ఫ్ గోల్'



రాజకీయ నాయకులు తెలుసో, తెలియక అప్పుడప్పుడు సెల్ఫ్‌గోల్ వేసుకుంటుంటారు. తేరుకుని చేసిన తప్పును దిద్దుకోవడానికి నానా తంటాలు పడాల్సి వస్తుంటుంది. ఇలాంటి పరిస్థితే టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నూరు సుగుణమ్మకు ఎదురైంది. టీడీపీ అధినేత చంద్రబాబు గొంతుకతో తిరుపతి నియోజకవర్గంలో ఇటీవల ఐవీఆర్(ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్) సర్వే జరిగింది. టీడీపీ అభ్యర్థులుగా ఊకా విజయకుమార్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, జేబీ శ్రీనివాస్, బట్టే వెంకటకీర్తి పేర్లతో సర్వే చేపట్టారు. బట్టే వెంకటకీర్తి ఎవరనే చర్చ, సందేహం చాలామందిలో కలిగింది. సుగుణమ్మ మనవరాలే బట్టే వెంకటకీర్తి అలియాస్ బీవీ కీర్తి. పార్టీ కేడర్‌కి తప్ప సాధారణ ప్రజలకు ఆమె గురించి తెలియకపోవడంతో సర్వేలో వెనకబడినట్టు తెలిసింది. దీనికిముందు సుగుణమ్మ, నోటా...ఈ రెండు ఆప్షన్లతోనే చంద్రబాబు ఐవీఆర్ సర్వే నిర్వహించారు. ఒకే పేరుతో వచ్చింది కాబట్టి అభ్యర్థిగా ఆమెనే ఎంపిక చేయవచ్చనే అభిప్రాయానికి పార్టీ శ్రేణులు వచ్చారు. ఇక్కడే ఆమె సెల్ఫ్‌గోల్ వేసుకున్నారు. సర్వే తనకు సానుకూలంగా వచ్చింది కాబట్టి తనకు బదులు మనవరాలికి టికెట్ ఇస్తే గెలిపించుకుంటానని సుగుణమ్మ అధిష్ఠానానికి ప్రతిపాదన పంపినట్టు తెలిసింది. దీంతో నలుగురు పేర్లతో మరోసారి ఐవీఆర్ఎస్ చేయాల్సి వచ్చింది. మనవరాలికి అనుకూలంగా రాకపోవడం, అధిష్ఠానం మరో ఆప్షన్ వైపు మొగ్గు చూపుతున్నట్టు వార్తలు రావడంతో అనవసరంగా 'సెల్ఫ్‌గోల్' వేసుకున్నామా? అన్న ఆలోచనలో ఆమె ఉన్నట్టు తెలుస్తోంది.

- తిరుపతి-ఆంధ్రజ్యోతి

రిమ్స్‌లో ముగిసిన టెక్నో అండ్ గ్యాబ్‌ఫెస్ట్



యంగ్ మేనేజర్ అవార్డును అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 4: బైరాగిపట్టెడలోని కొండారెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్) విద్యార్థులకు మూడ్రోజులు నిర్వహించిన టెక్నో అండ్ గ్యాబ్‌ఫెస్ట్ ఆదివారంతో ముగిసింది. రూరల్ మండలం సి.గొల్లపల్లెలో ఉన్న సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ముగింపు సభలో వివిధ అంశాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా ధ్రువపత్రాలు, అవార్డులు, బహుమతులు అందజేశారు. యంగ్‌మేనేజర్ విభాగంలో విద్యార్థులు దివ్యవాణి, ముత్తులక్ష్మి విజేతలుగా నిలిచి, అవార్డులు అందుకున్నారు. ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనమైన ప్రతిభను ప్రదర్శించేందుకు, లోపాలను సరిదిద్దుకుని సామర్థ్యాలను మెరుగుపరచుకునేందుకు ఇటువంటి సదస్సులు దోహదం చేస్తాయన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఛైర్మన్ వై.కొండారెడ్డి, డైరెక్టర్లు వై.ఆనందరెడ్డి, వై.విజయ్‌రెడ్డి, హెచ్‌వోడీలు పి.నిరంజన్‌రెడ్డి, పి.మధుర పాల్గొన్నారు.

మెకానిక్‌కు చేయూత



సాయం అందజేస్తున్న ఆవుల మునిరెడ్డి

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 4: చిన్నగొట్టిగల్లు మండలం దిగువగుంటవారిపల్లికి చెందిన వికలాంగుడైన టూవీలర్స్ మెకానిక్‌కు తిరుపతి జిల్లా టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ తరఫున రూ.10వేలు, భాకరాపేట ఇన్‌చార్జి ముకాబుల్లా, సభ్యుల తరఫున మరో రూ.10వేలు మొత్తం రూ.20వేలు అందజేశారు. 2వీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఈ మొత్తాన్ని ఆదివారం లక్ష్మీనారాయణ కుటుంబానికి అందజేశారు. విధి నిర్వహణలో భాగంగా రోడ్డు ప్రమాదానికి గురై లక్ష్మీనారాయణ వికలాంగుడయ్యాడని తెలిపారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జలంధర్, గౌస్‌బాషా, గురవాచారి, సోమశేఖర్, ముకాబుల్లా, వాసు, ధరణి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణకు అవగాహన అవసరం

● వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు



ర్యాలీని ప్రారంభిస్తున్న కృష్ణబాబు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 4 : క్యాన్సర్‌ను పూర్తి స్థాయిలో నివారించాలంటే దానిపై అవగాహన ప్రధానమని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా స్విమ్స్ శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన క్యాన్సర్ అవేర్నెస్ వాక్‌ను ఆయన ప్రారంభించారు. కలెక్టర్ లక్ష్మీ శా, డీఎంహెచ్‌వో శ్రీహరి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, బీఐఈవో ప్రత్యేకాధికారి జయచంద్రారెడ్డితో కలిసి స్విమ్స్ సర్కిల్ వరకు ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన పెంచాల్సిన బాధ్యతను ఆరోగ్య కార్యకర్తలు తీసుకోవాలన్నారు. క్యాన్సర్‌తో ఏ ఒక్కరూ చనిపోకూడదనే ఉద్దేశంతో దాని నివారణపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించిందన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే వారి ప్రాణాలను కాపాడవచ్చునని అన్నారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీహరి, బీఐవో ప్రత్యేకాధికారి జయచంద్రారెడ్డి, స్విమ్స్ ఎంఎస్ రామ్ పాల్గొన్నారు.

క్యాన్సర్ రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం

● టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



పోస్టర్లను విడుదల చేస్తున్న టీటీడీ ఛైర్మన్, ఈవో, స్విమ్స్ అధికారులు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 4 : ఏపీని క్యాన్సర్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. మహిళల్లో క్యాన్సర్‌ను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించే పింక్ బస్సును ఆయన స్విమ్స్‌లో ఆదివారం ప్రారంభించారు. క్యాన్సర్ నిర్మూలనకు అవసరమైన భవనాలను, వైద్య పరికరాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. అనంతరం ఎంపీ గురుమూర్తి, టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జేఈవో సదా భార్గవి, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, కలెక్టర్ లక్ష్మీ శా, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, బీఐవో ప్రత్యేకాధికారి జయచంద్రారెడ్డి, డీఎంహెచ్‌వో శ్రీహరి, పింక్ బస్సు దాత వేమిరెడ్డి ప్రశాంతితో కలిసి క్యాన్సర్‌పై అవగాహన పోస్టర్లను విడుదల చేశారు.

మధుసూదన్‌రెడ్డికి ఎక్సలెన్సీ పురస్కారం



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 4: బైరాగిపట్టెడలోని ఎంజీఎం స్కూల్‌లో పనిచేసే బయాలజీ టీచర్, యూటీఎఫ్ జిల్లా నాయకుడు బండి మధుసూదన్‌రెడ్డికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఎక్సలెన్సీ పురస్కారం దక్కింది. ఈ మేరకు సీవీరామన్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో సన్మానించారు. సువర్ణ కంకణ సత్కారం చేశారు. ఆయన్ను పలువురు టీచర్లు, సంఘ నాయకులు అభినందించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.22 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.22 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 69,232 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,536 మంది తలనీలాలు సమర్పించారు.

ఆశావర్కర్లు పోరాటాలకు సన్నద్ధం కండి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 4 : రాష్ట్రంలో ఆశావర్కర్ల శ్రమను ప్రభుత్వం దోచుకుంటోందని, సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధం కావాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ కోరారు. నారాయణపురంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఆశావర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షురాలు వై.కస్మణి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ మాట్లాడుతూ పెరిగే జనాభాకనుగుణంగా ఆశావర్కర్ల సంఖ్యను పెంచకపోవడంతో ఉన్న వారిపై పనిభారం పడుతోందన్నారు. కనీస వేతనం అమలు చేయకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఆశావర్కర్లపై అధికారులు, ఏఎన్ఎంల పెత్తనం మానుకోవాలని కోరారు. ఆశావర్కర్స్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాదేవి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకనుగుణంగా జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షురాలు భారతి, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, నాయకులు సురేంద్రనాథ్, రాణి, కవిత, నందని, కళ పాల్గొన్నారు.

హెచ్చరిక

ఇందు మూలముగా యావన్మంది ప్రజానీకమును హెచ్చరించడం ఏమనగా, తిరుపతి జిల్లా, తిరుపతి మండలం, శెట్టిపల్లి పోస్టు, సి.ఆర్.ఎస్. రైల్వే క్వార్టర్స్, West Colory, 216(C)లో నివాసముంటూ మా కక్షిదారు శ్రీ విక్టర్ పేజ్ గారి కుమారుడు ఫ్రాన్సిస్ పేజ్ తరపున హెచ్చరించడం ఏమనగా, మా కక్షిదారునికి సహోద్యోగులైె మరియు వారి స్నేహితులైన ఎస్.పురుషోత్తం, S/o S.B. కుమార్, K. అర్ముగం, B. శ్రీనివాస రావు, O. క్రిష్ణయ్య, ఎస్.గణేష్, షేక్ జబ్బార్, కె.గురవయ్య, చల్లా గంగులప్ప, విశ్వనాథ్ యాదవ్ అను వారు మా కక్షిదారుని వద్ద 2020వ సంవత్సరం నుంచి ఆర్థిక లావాదేవీలు జరిపి, ఆ సమయంలో మా కక్షిదారును ఒత్తిడికి గురిచేసి మా కక్షిదారు వద్ద పూచీకత్తుకు గాను SBI శెట్టిపల్లి శాఖ వారు జారీ చేసిన 1652956 to 653055, 246786 to 246835, 224651 to 224700 539611 to 539010, 440041 to 440050 చెక్కులను కెనరా బ్యాంక్ శెట్టిపల్లి శాఖ వారు జారీచేసిన (A/c No. 31752180000367) 475346 to 475370, 004810 to 004835, 778536 to 778560, 77856 to 778585; 250826 to 250850, చెక్కులను ICICI Bank తిరుపతి శాఖ వారు జారీ చేసిన 000501 to 000510 ఖాళీ చెక్కులను వారి వారి స్వాధీనంలో వుంచుకొని మా కక్షిదారు బాకీ పద్ధ మొత్తం చెల్లించినా కూడా పై కనిన చెక్కులను, మా కక్షిదారు వద్ద తీసుకున్న ప్రామిసరి నోట్లను తిరిగి ఇవ్వకుండా మా కక్షిదారుని, అతని కుటుంబ సభ్యులను మానసికంగా హింసిస్తూ, దౌర్జన్యానికి దిగి, వేధిస్తూ అయాచిత లబ్ధి పొందలని వారు, వారు తరపున ఇతరుల ద్వారా తప్పుడు దావాలు, ఫిర్యాదులు దాఖలు చేస్తామని, మా కక్షిదారుని ఇంటిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి, మానసిక ఆవేదనకు గురిచేస్తున్నారు. కావున పై కనిన వారు గాని, వారి ద్వారా చెక్కులు, ప్రామిసరి నోట్లు పొంది ఇతరులు ఎవరైనా మా కక్షిదారునిపై ఎలాంటి తప్పుడు, మోసపూరిత ఫిర్యాదులు, దావాలు దాఖలు చేసిన అట్టివి ఎలాంటివి చెల్లనేరవు. అట్లు ఈ హెచ్చరికను మీరి ఎవరైనా ప్రవర్తించిన యెడల మా కక్షిదారులు తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు అట్టివారు బాధ్యులుకాగలరని హెచ్చరించడమైనది.

శ్రీ సి.హెచ్.యం.యస్ రాజా
శ్రీ పేరందూరు గజేంద్ర
న్యాయవాదులు, తిరుపతి

ఆటస్థలాన్ని పరిరక్షించకుంటే ఉద్యమం తప్పదు

ఎస్వీ హైస్కూల్ పూర్వవిద్యార్థుల హెచ్చరిక



మైదానం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు, పూర్వ విద్యార్థులు

తిరుపతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఎస్వీ హైస్కూల్‌కు చెందిన క్రీడా ప్రాంగణంలో నిర్మాణాలు నిలపకుంటే తీవ్రస్థాయిలో ఉద్యమం చేపట్టాల్సి ఉంటుందని హైస్కూల్ పూర్వ విద్యార్థులు హెచ్చరించారు. ప్రకాశం రోడ్డులోని ఆటస్థలంలో టీటీడీ బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టడాన్ని నిరసిస్తూ ఆదివారం మరోసారి పూర్వ విద్యార్థులు, పలు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు అక్కడికి చేరుకున్నారు. ముందే సమాచారం అందుకున్న పోలీసులు పెద్దఎత్తున అక్కడకు చేరుకున్నారు. వారిని లోపలకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. కొద్దిసేపటి తర్వాత కొంతమందిని లోపలికి అనుమతిచ్చారు. 'ప్లే గ్రౌండ్‌లో భవనాలు వద్దు-ఆటలు ముద్దు' అంటూ నినాదాలు చేశారు. 134 ఏళ్ల చరిత్ర కలిగిన క్రీడా మైదానంలో వసతిగృహం నిర్మించడం దారుణమన్నారు. ఈ ప్రతిపాదనను విరమించుకోకపోతే విద్యార్థి సంఘాలు, క్రీడాభిమానులను భాగస్వామ్యం చేసి పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఊకా విజయకుమార్, ఆర్సీ మునికృష్ణ, బీజేపీ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, పొనగంటి భాస్కర్, వరప్రసాద్, బీఆర్ఎస్ నేత ఆర్కాట్ వరప్రసాద్, జనసేన నాయకులు హేమకుమార్, కొండా రాజమోహన్, కాంగ్రెస్ నాయకుడు నారాయణస్వామి, ఆమ్‌ఆద్మీ నాయకులు నగేష్, రాజేష్, పూర్వ విద్యార్థులు బయ్ అండ్ సేవ్ మధు, రమేష్, లక్ష్మీనారాయణ, పురుషోత్తం, తులసీరామ్ రెడ్డి, రాఘవేంద్ర, జీవన్, బాల సుబ్రమణ్యం, అబ్దుల్లా, రఫీ పాల్గొన్నారు.

హాస్టల్ నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం



వీసీ శ్రీకాంత్‌రెడ్డికి విరాళాన్ని అందజేస్తున్న భక్తులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 4: ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ లేడీస్ హాస్టల్ నిర్మాణానికి నెల్లూరుకు చెందిన పర్వతరెడ్డి బలరామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ రూ.10 లక్షల విరాళం ప్రకటించింది. ఈ మొత్తాన్ని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డిని కలిసి దాతలు ఆదివారం అందజేశారు. ట్రస్ట్ ప్రతినిధులు స్రవంతి, సురేష్, వెంకటరమణారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవాల్లో మొదటి స్థానం

మైమ్, స్కిట్‌లో రాణించిన పద్మావతి కాలేజీ బృందం



విజేతలను అభినందిస్తున్న నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 4: గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ యువజనోత్సవాల్లో పద్మావతి కాలేజి బృందం మైమ్, స్కిట్‌లో మొదటి స్థానంలో నిలిచింది. విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ నాగభూషణం బహుమతులను అందజేసి అభినందించారు. కాగా, ఈ బృందానికి పత్తిపాటి వివేక్ నేతృత్వం వహించారు.

అద్వానీకి భారతరత్నపై సంబరాలు



మిఠాయిలు తినిపించుకుంటూ ఆనందం పంచుకుంటున్న బీజేపీ నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 4: బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీకి భారతరత్న పురస్కారం లభించడం పట్ల తిరుపతిలో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. మిఠాయిలు పంచిపెట్టారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ సభ్యుడిగా హిందూ మత పరిరక్షణకు అద్వానీ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. బీజేపీ రాయలసీమ అభివృద్ధి కమిటీ కోకన్వీనర్ డాక్టర్ శ్రీహరిరావు, తిరుపతి అసెంబ్లీ కన్వీనర్ అజయ్ కుమార్, సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, పాటిబండ్ల మురళి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే వారిని పరీక్షకు అనుమతించం

పద్మావతి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వివరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 4: పద్మావతి జూనియర్ కాలేజీలో 24 మంది విద్యార్థినులను పరీక్షలకు నిబంధనల ప్రకారమే అనుమతించలేదని ప్రిన్సిపాల్ భువనేశ్వరిదేవి వివరణ ఇచ్చారు. ఇందులో 16 మంది మొదటి సంవత్సరం, 8 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థినులు ఉన్నారని చెప్పారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉన్నందున పరీక్షా ఫీజు చెల్లించకూడదని సూచించామన్నారు. కాలేజీకి రాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించామని తెలిపారు. విద్యార్థి సంఘాలు వాస్తవాలు తెలుసుకుని కాలేజీకి, ప్రిన్సిపాల్‌కు సహకరించాలని ఒక ప్రకటనలో సూచించారు.

నత్తంకండ్రిగలో వ్యక్తి హత్య



జగదీష్ నాయుడు మృతదేహం

నగరి, ఫిబ్రవరి 4: నగరి మండలం నత్తంకండ్రిగకు చెందిన జగదీష్ నాయుడు(34) శనివారం రాత్రి హత్యకు గురయ్యారు. సీఐ సురేష్ నాయుడు తెలిపిన ప్రకారం.. శనివారం రాత్రి తన ఇంటి వద్ద ఉన్న జగదీష్‌పై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేశాడు. గాయపడిన ఆయన్ను స్థానికుల సాయం తో కుటుంబీకులు ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. అనంతరం మృతదేహాన్ని నగరి ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చారు. ఆదివారం పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ మేరకు నగరి సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్టీ కాలనీలోని ఓ మహిళతో ఉన్న వివాహేతర సంబంధమే ఈ హత్యకు దారి తీసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఆ మహిళ విడాకులకు కోర్టుకు వెళ్లారని అంటున్నారు. ఎలాగైనా చంపేస్తానని ఆ మహిళ భర్త పలుసార్లు బెదిరించడంతో జగదీష్ తన ఇంటి వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నట్లు అతడి బంధువులు చెప్పారు. ఈ క్రమంలో ఆ మహిళ భర్తే ఈ దారుణానికి పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు.



పదవుల కోసమే కార్పొరేషన్లు: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

తడ, ఫిబ్రవరి 4: వైసీపీ నేతలకు పదవులు కట్టబెట్టడానికి కులాల పేరిట ప్రభుత్వం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీలను మభ్యపెట్టిందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం విమర్శించారు. ఆదివారం తడలో జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ఏర్పాటు చేసిన వివిధ కులాల కార్పొరేషన్లకు నిధులు కేటాయించకపోవడంతో నిర్వీర్యమైపోయాయని అన్నారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యం ఇచ్చింది ఎన్టీఆర్, చంద్రబాబే అని గుర్తు చేశారు. సీఎం జగన్ నా బీసీలు, నా బడుగు, బలహీన వర్గాలు అంటూ వారిపైనే తప్పుడు కేసులు బనాయించి జైలుపాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఖజానాను లూటీ చేసి, ఆ డబ్బుతో వచ్చే ఎన్నికల్లో గెలవచ్చని భ్రమలో జగన్ ఉన్నారని తెలిపారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మాట్లాడుతూ వైసీపీ శ్రేణులకు వచ్చే ఎన్నికల్లో ఓటమి రుచిని చూపిస్తామని చెప్పారు. ప్రజలు సైతం రాష్ట్ర భవిష్యత్తు టీడీపీతోనే అని నిర్ధారణకు వచ్చారని స్పష్టం చేశారు. సమావేశంలో టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, ఓజిలి, పెళ్లకూరు మండలాల అధ్యక్షులు సంచి కృష్ణయ్య, విజయకుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు సదాశివం, కార్యదర్శి మునస్వామి, నాయకులు సుదర్శన్, బొమ్మన పళణి, సెల్వం, జయపాల్, రవి, భాస్కర్, మెస్ రమణయ్య, మాధవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళా సాధికారిత

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 4: టీడీపీతోనే మహిళా సాధికారిత సాధ్యమని నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు న్యూ కాలనీలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, నాపా మునిరాజా, మునస్వామి, మేడా సాయి నారాయణ, పెంచలయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు పాటించాలి



ఎమ్మెల్యే వరప్రసాద్‌రావును సన్మానిస్తున్న క్రీడాకారులు

గూడూరు, ఫిబ్రవరి 4: ప్రతిఒక్కరరూ ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రీడాకారులు, వాకర్ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ స్టేడియం అభివృద్ధికి ఎమ్మెల్యే ఎంతో కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దారుఢ్యం మెరుగుపడడంతో పాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు.అనంతరం హాకీ క్రీడాకారులకు ఎమ్మెల్యే సొంత నిధులతో క్రీడా సామగ్రి అందజేశారు. అదేవిధంగా అమరావతి ఆస్పత్రికి చెందిన డాక్టర్ రమణయ్య, నిర్మల దాతృత్వంతో మహిళలకు యోగా మ్యాట్‌లను అందజేశారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, మునిగిరీష్, విజయ్‌కుమార్, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, దీపక్‌ఆకాష్, లవకుమార్, నరసయ్య, మస్తాన్ పాల్గొన్నారు.

తాళమ్మకు నెలపొంగళ్లు

గూడూరు, ఫిబ్రవరి 4: గ్రామదేవత తాళమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు నెలపొంగళ్లు పెట్టారు. భోగి పండుగ తరువాత వచ్చే మూడో ఆదివారం అమ్మవారికి నెలపొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 4: పట్టణంలోని ఎన్‌జేఆర్ సర్కిల్‌లో మీ సేవ కేంద్రం వద్ద ఉన్న వివాదాస్పద స్థలాన్ని గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. సర్వే నెం. 227.10లో 48సెంట్ల ప్రభుత్వ స్థలానికి కొంతకాలం క్రితం ఓ వ్యక్తి ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో అధికారులు అడ్డుకున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో కిరణ్‌కుమార్ సదరు స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రమేష్ బాబు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

టీడీపీ జిల్లా కార్యదర్శిగా శోభన్‌నాయుడు

నాయుడుపేట, ఫిబ్రవరి 4: నాయుడుపేట పట్టణంలోని బేరిపేటకు చెందిన శోభన్ నాయుడును తిరుపతి జిల్లా టీడీపీ కార్యదర్శిగా నియమించినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శోభన్‌నాయుడును శాలువా కప్పి సన్మానించారు. టీడీపీ నాయకులు విజయకుమార్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, కిష్టయ్య, పసల గంగాప్రసాద్, మాధవ నాయుడు, అవధానం సుధీర్, రాజేంద్ర, బాబు, లక్ష్మయ్య, చిరువెళ్ల మునిరాజ, సుజాతమ్మ, సుగుణమ్మ, సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.22 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.22 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రైల్లో నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి



తడ, ఫిబ్రవరి 4: ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారిపడి ప్రయాణికుడు మృతి చెందాడు. శనివారం రాత్రి సమయంలో చెన్నై నుంచి సూళ్లూరుపేటకు వెళ్తున్న సబర్బన్ రైలు నుంచి సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ వ్యక్తి రైలు దిగుతూ ప్రమాదవశాత్తు జారి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్టేషన్ సిబ్బంది 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతని వద్ద చెన్నై అత్తిపట్టు నుంచి సూళ్లూరుపేట వరకు తీసుకున్న టికెట్ మాత్రమే లభ్యమైంది. ఇతర వివరాలు ఏవీ తెలియలేదు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ పాలనతో జనం విసిగిపోయారు: పాశిం

గూడూరు, ఫిబ్రవరి 4: వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనతో జనం విసిగిపోయారని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో కోట మండలం తిమ్మానాయుడుపాళెం, చిల్లకూరు మండలం రెట్టపల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు. వారికి సునీల్‌కుమార్ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. వైసీపీ నాయకుల అవినీతి, దౌర్జన్యాలు, దాడులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రశ్నించిన వారిపై దాడులు చేయడమే కాకుండా తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రధానంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో నిరుద్యోగులుగా మారి అవస్థలు పడుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాలను రద్దు చేయడంతో పాటు ఎస్సీ కార్పొరేషన్ నిధులను పక్కతోవ పట్టించి దళితులు, గిరిజనులను ఈ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వంతోనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందని, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి కల్పించిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. అభివృద్ధిని కాంక్షించే టీడీపీలో పలువురు చేరుతున్నారని, ముఖ్యంగా యువత అధిక సంఖ్యలో చేరుతుండడం సంతోషకరంగా ఉందని సునీల్ కుమార్ అన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్వోత్తరెడ్డి, రవీంద్రరెడ్డి, సుబ్బయ్య, రమేష్, అశోక్, ప్రసాద్, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో సునీల్‌కుమార్

వైసీపీ గెలుపునకు సమష్టిగా కృషి చేయండి: మంత్రి పెద్దిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 4: వైసీపీ గెలుపునకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. నాయుడుపేట - మేనకూరులో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ స్మృతివనం, పాల శీతలీకరణ కేంద్రం, రైతు భరోసా కేంద్రం, ఆయుష్మాన్ భారత్ హెల్త్ సెంటర్, గ్రంథాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ వైసీపీ శ్రేణులంతా ఒకే కుటుంబమని, అరమరికలు వస్తుంటాయని, వాటిని మరచి పార్టీ విజయానికి కృషి చేయాలని ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే సంజీవయ్యకు హితవుపలికారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మేనకూరుకు సెజ్‌ను తీసుకురావడంతో వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని అన్నారు. మేనకూరులో కోట్లాది రూపాయలతో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్‌రెడ్డిని మంత్రి అభినందించారు. అంతకుముందు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు సేవచేసే తమ కుటుంబాన్ని విమర్శిస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. నియోజకవర్గంలో కొందరు సొంతపార్టీ నేతలనే టార్గెట్ చేస్తూ విమర్శిస్తున్నారని, ఇలాంటివి మానుకొని పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. పదవులు ముఖ్యంకాదని, ప్రజలకు చేసిన సేవే చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన మేనకూరుకు కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కాగా, మంత్రి పాల్గొన్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సంజీవయ్య అనుచరవర్గం ఎవరూ పాల్గొనకపోవడంతో చర్చనీయాంశమైంది. కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, నెల్లూరు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జడ్పీటీసీ కట్టా జ్యోతి, వెంకటరమణారెడ్డి, కమలాకర్ రెడ్డి, భవానీశంకర్‌రెడ్డి కోటారెడ్డి, షేక్ రఫీ, మధురెడ్డి పాల్గొన్నారు.

ధర్మపరిరక్షణకు నడుం బిగించాలి

ధార్మిక సదస్సులో స్వామీజీలు



తిరుమల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సనాతన హిందూ ధర్మపరిరక్షణకు అందరూ నడుం బిగించాలని మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థస్వామిజీ పిలుపునిచ్చారు. తిరుమలలో జరుగుతున్న ధార్మిక సదస్సులో భాగంగా రెండో రోజు ఆయన మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మవ్యాప్తికి టీటీడీనే పునాది అన్నారు. ధర్మప్రచారం కోసం టీటీడీ వేల కోట్లు వెచ్చిస్తున్నా కొంతమంది ఉద్దేశపూర్వకంగా తప్పుపట్టడం సరికాదన్నారు. దేశంలోని ఇతర మతస్థులకు కూడా మన సంప్రదాయాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంప్రదాయల పరిరక్షణ కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పుష్పగిరి మఠాధిపతి విద్యాశంకర భారతిస్వామి అన్నారు. ఉడిపి అదమారు మఠాధిపతి ఈశప్రియ తీర్థస్వామిజీ అనుగ్రహభాషణం చేస్తూ హిందువులు వేదాలు, ఉపనిషత్తులకు సంబంధించిన జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఇతిహాస పురాణాలు యువత సన్మార్గంలో పయనించడానికి సహాయపడతాయని పుత్తిగె మఠాధిపతి సుగుణేంద్రతీర్థ స్వామిజీ అన్నారు. విద్యార్థులకు ధర్మాన్ని బోధించే విధంగా పాఠ్యాంశాలు ఉండాలని, యోగసాధన శారీరక, మానసిక వికాసానికి ఉపయోగపడుతుందని ఉత్తరాధి మఠాధిపతి విద్యాధీశ తీర్థస్వామీజీ అన్నారు. విశ్వ హిందూ పరిషత్ అంతర్జాతీయ కార్యదర్శి రాఘవులు మాట్లాడుతూ పారాయణాల్లో మహిళల్ని భాగస్వాములు చేయాలన్నారు. శ్రీపాదరాజ మఠాధిపతి సుజనయనిధి తీర్థస్వామీజీ మాట్లాడుతూ యువత, బాలల్లో ధార్మిక ప్రచారం కోసం ఒక్కో స్వామీజీ ఒక్కో జిల్లాను దత్తత తీసుకోవాలని సూచించారు. ఉత్తరాఖండ్‌కు చెందిన జ్యోతిర్‌మఠాధి ముకుందానంద మహరాజ్ మాట్లాడుతూ గోమాతను విశ్వమాతగా ప్రకటించాలన్నారు. మన్నార్ గుడి శాంతాలంకార షెన్ భాగమన్నార్ జీయర్ స్వామి మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మత మార్పిడులను నివారించడానికి టీటీడీ కృషి చేయాలన్నారు. ఉడిపి కన్నూర్ మఠాధిపతి విద్యావల్లభతీర్థ స్వామీజీ మాట్లాడుతూ వేద అధ్యయనం చేస్తున్న విద్యార్థులకు మరింత ఆర్థిక సహాయం చేయాలన్నారు. బెంగళూరుకు చెందిన విద్యా విజయతీర్థ స్వామీజీ మాట్లాడుతూ విద్య, వైద్యానికి సంబంధించి టీటీడీ మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ఉన్న ఆలయాల్లో ధర్మ పరిరక్షణ చేయాలి

తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది ఆలయాలున్నాయని, వాటిలో ధర్మరక్షణ కోసం అర్చకులను భాగస్వాములను చేయాలని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు సౌందర్యరాజన్ రంగరాజన్ అన్నారు. తిరుమలలో నూతన కట్టడాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కమలానంద భారతి స్వామి కోరారు. శ్రీవారి సేవకు ముస్లిం భక్తులను అనుమతించాలన్న ఈవో నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

సదస్సు విజయవంతం : ఈవో

తిరుమలలో జరుగుతున్న ధార్మిక సదస్సుకు 57 మంది స్వామిజీలను ఆహ్వానించగా అందరూ ప్రత్యక్షంగా, పరోక్షంగా అనుగ్రహభాషణం అందించారని, ఈ విధంగా సదస్సు విజయవంతమైందని టీటీడీ ఈవో ధర్మారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

ఇంత సంఖ్యలో అనుగ్రహభాషణం శుభసూచికం: జీయర్‌స్వాములు

దేశవ్యాప్తంగా స్వామీజీలు ఆయా సంప్రదాయాల్లో ధర్మప్రచారం చేస్తున్నారని, వారి సూచనలు తీసుకుని టీటీడీ మరింతగా ధర్మప్రచారం చేస్తుందని తిరుమల పెద్ద, చిన్నజీయర్‌స్వాములు అన్నారు. ఇంతపెద్ద సంఖ్యలో స్వామిజీలు పాల్గొనడం శుభసూచికమన్నారు.

జపాన్‌లో శ్రీసిటీ మార్కెటింగ్ బృందం సమావేశాలు

శ్రీసిటీ, ఫిబ్రవరి 4: భవిష్యత్‌లో శ్రీసిటీ-జపాన్ వ్యాపార బంధం మరింత బలోపేతం అయ్యే దిశగా శ్రీసిటీ మార్కెటింగ్ బృందం చొరవ చూపుతోంది. గత వారం టోక్యో ఆటోమోటివ్ వరల్డ్ ఎక్స్‌పోలో పాల్గొనడంతోపాటు ప్రస్తుతం జపాన్‌లో పర్యటిస్తూ చురుగ్గా.. మార్కెటింగ్ ప్రణాళికలను అనుసరిస్తోంది. ఇందులో భాగంగా జపాన్‌లో భారత రాయబారి సీబీ జార్జ్‌తో నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు (పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు) ఆర్.వీరారెడ్డి, జమైకాలోని జపాన్ మాజీ రాయబారి, శ్రీసిటీకి సలహాదారు మసనోరి నకనో శ్రీసిటీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) గోపికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ప్రస్తుతం 28 దేశాలకు చెందిన 210 కంపెనీలు శ్రీసిటీలో ఏర్పాటు అయ్యాయని, అందులో జపాన్ దేశ పరిశ్రమలు 30 ఉన్నట్లు చెప్పారు. శ్రీసిటీ భారతదేశంలో రెండో అతి పెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చురుకైన పారిశ్రామిక విధానాల ఫలితంగా శ్రీసిటీ మరింత వేగవంతమైన పురోగతిని సాధిస్తూ ప్రధాన పెట్టుబడి గమ్యస్థానంగా మారిందంటూ భారత రాయబారి ప్రశంసించారు. ఇంకా జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో), మినిస్ట్రీ ఆఫ్ ఎకానమీ, ట్రేడ్, ఇండస్ట్రీ(మెటీ)లకు చెందిన సీనియర్ ప్రతినిధులతో సైతం శ్రీసిటీ అధికారులు సమావేశమై చర్చించారు. జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లో చేపడుతున్న పనులు, శ్రీసిటీలోని జపాన్-ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఫర్ మాన్యుఫ్యాక్చరింగ్ (జిమ్) పనితీరు, ఇతర వ్యాపార వ్యవహారాలపై వీరు ప్రధానంగా చర్చలు జరిపారు. ఎస్ఎంబీసీ బ్యాంకు, మిజుహో బ్యాంకు, జపాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సమావేశమై పెట్టుబడులు, ఇతర అంశాలపై చర్చించారు. శ్రీసిటీ ప్రయత్నాలు మంచి ఫలితాలను సాధిస్తాయని, జపాన్‌తో శ్రీసిటీ వ్యాపార బంధం మరింత బలోపేతం అవుతుందంటూ శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.



జెట్రో ప్రతినిధులతో శ్రీసిటీ అధికారులు

వైసీపీని తరిమికొట్టండి: టీడీపీ



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

చిల్లకూరు, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో తరిమికొట్టాలని టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని అన్నంబాక గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. వైసీపీ పాలనతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చంద్రబాబునాయుడు అనే సంక్షేమ పథకాలను అమలు పరిచేలా మినీ మెనిఫెస్టోను రూపొందించారన్నారు. రానున్న ఎన్నికలలో ప్రజలు టీడీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, మునిశేఖర్‌గౌడ్, కుమార్, వంశీరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శేషయ్య, వెంకటేశ్వరమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని తరిమికొడదాం: జనసేన



సిద్ధమ్మకండ్రిగలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న జనసేన నేతలు

కోట, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్‌రావు కోరారు. మండల పరిధిలోని కేశవరం పంచాయతీలో గల సిద్ధమ్మకండ్రిగలో ఆదివారం 'జనంలోకి జనసేన' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధమ్మకండ్రిగ, రామాపురం గ్రామాల్లో జనసేన నాయకులు పర్యటించి వైసీపీ వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, మోహన్, ఇంద్రవర్ధన్, అంకయ్య, కోటయ్య, పరుశురామ్, శ్రీనాథ్, మాతయ్య, జగదీష్, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఇక టీచర్ల పోరాటం

సన్నద్ధం కావాలని ఆపస్ పిలుపు



సమావేశంలో ప్రసంగిస్తున్న బాలాజి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 4: రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సన్నద్ధం కావాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజి పిలుపునిచ్చారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో ఆదివారం జరిగిన సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. టీచర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా దాటవేత ధోరణి ప్రదర్శిస్తోందని, ఉద్యమ కార్యాచరణ చేపట్టక తప్పదని అన్నారు. ప్రతిపక్షనేత హోదాలో సీఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్‌ని రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలని పలుమార్లు కోరామని, అయితే బలవంతంగా జీపీఎస్‌ని ప్రవేశపెట్టారని వాపోయారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. కరువుభత్యం, మధ్యంతర భృతి ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. రాష్ట్రీయ సైనిక్ మహాసంఘ సంఘటన కార్యదర్శి శ్రావణ్‌కుమార్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ క్షేత్రప్రచారక్ భరత్‌కుమార్ మాట్లాడారు. అఖిల భారత రాష్ట్రీయ సైనిక్ మహాసంఘ జాతీయ సంఘటన మంత్రి మహేంద్రకపూర్, సహ కార్యదర్శి రాజశేఖర్‌రావు, ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావంతోనే బీసీల్లో చైతన్యం



సమావేశంలో మాట్లాడుతున్న భాను ప్రకాష్

వడమాలపేట, ఫిబ్రవరి 4: టీడీపీ ఆవిర్భావంతోనే బీసీల్లో రాజకీయ చైతన్యం ప్రారంభమైందని ఆ పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం వడమాలపేటలో జయహో బీసీ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలు టీడీపీకి వెన్నుముకలా నిలుస్తున్నారని అన్నారు. వెనకబడిన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తూ స్థానిక సంస్థల్లో 3శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో అవినీతి, దౌర్జన్యాలు, దాడులు తప్ప అభివృద్ధి జాడే లేదన్నారు. సంక్షేమం పేరుతో ప్రజలను మభ్యపెట్టి పన్నులు, చార్జీల రూపంలో లాగేసుకుంటున్నారని విమరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని భాను ప్రకాష్ కోరారు. అనంతరం బీసీ నాయకులను సన్మానించారు. సమావేశంలో టీడీపీ నాయకులు జానా వెంకటయ్య, షణ్ముగ రెడ్డి, ధనంజయ యాదవ్, దాముయాదవ్, ఉమాపతిరావ్, వెంకటేశ్వర రావ్, మునిరత్నం, లక్ష్మీప్రసన్న, సుబ్రహ్మణ్యం రెడ్డి, రవిరెడ్డి, శోభనాద్రి యాదవ్, రఘు, దనంజయులు నాయుడు, ధనలక్ష్మి, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీటీసీ

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 4: పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం వైసీపీ ఎంపీటీసీ శ్రీజ, ఆమె భర్త నర్రా బాలాజీ నాయుడు టీడీపీలో చేరారు. టీడీపీ నాయకుడు పోతుగుంట విజయబాబు ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరిలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును కలిశారు. శ్రీజ తన భర్త నర్రా బాలాజీ నాయుడు దంపతులకు అచ్చెన్నాయుడును టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీలో సామాజిక న్యాయం అనేది ఒక ఫార్సని దుయ్యబట్టారు. కేవలం ఒక సామాజిక వర్గానికే ప్రాధాన్యత ఉందని స్పష్టం చేశారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఎలాంటి విధులు, గౌరవం లేదని ఆమె మండిపడ్డారు. వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమయ్యాయని, చంద్రబాబు మళ్లీ సీఎం అయితే తప్ప పేదలకు న్యాయం జరగదన్నారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి రవినాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి సుమన్ నాయుడు, రాఘూరు శంకర్‌నాయుడు, ప్రవీణ్‌నాయుడు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అచ్చెన్నాయుడుతో ఎంపీటీసీ శ్రీజ దంపతులు

ప్రజలకు రోజా చేసిందేమీ లేదు: భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 4: నగరి నియోజకవర్గానికి, ప్రజలకు మంత్రి రోజా ఇంత వరకు చేసిందేమీ లేదని... ఇకపై కూడా చేసేదేమీ లేదని టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 19 వార్డు బీడీ కాలనీ, కళ్యాణపురంలో మీతో మీ తెలుగుదేశం, బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని క్లస్టర్ ఇన్‌చార్జి, పట్టణ పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, యూనిట్ ఇన్‌చార్జి ఈశ్వర యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రిగా నియోజకవర్గాన్ని రూ.కోట్లతో అభివృద్ధి చేస్తుందని ఆశిస్తే.... డ్రైనేజీలు, సీసీ రోడ్లకు భూమి పూజలు చేస్తూ కాలం వెళ్లదీశారని మండిపడ్డారు. మరోనెల రోజుల్లో పదవీకాలం పూర్తవుతుందనగా ఇప్పుడు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తూ, శిలాఫలకాలను వేస్తూ ప్రజల చెవుల్లో పుష్పాలు పెడుతోందని ఎద్దేవా చేశారు. సర్పంచులు, కౌన్సిలర్లు చేయాల్సిన అభివృద్ధి పనులను సైతం తగుదునమ్మా అంటూ మంత్రి హోదాలో రోజా కొబ్బరికాయ కొట్టడం చూసి ఆ పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులే లోలోన రగలిపోతున్నారని విమర్శించారు. మంత్రి పదవి వల్ల నియోకవర్గానికి, ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడకపోయినా, ఆమె కుటుంబం మాత్రం బాగుపడిందని ఆరోపించారు. రోజా జిమ్మిక్కులు, గిమ్మిక్కులు నమ్మే పరిస్థితిలో నగరి నియోజకవర్గ ప్రజలు లేరని తేల్చి చెప్పారు. రానున్న ఎన్నికల్లో మంత్రి రోజాకు బుద్ధి చెప్పడానికి ఓటర్లు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఏపీఐఐసీ ఛైర్మన్‌గా, మంత్రిగా ఐదేళ్ల అధికారం వెలగబెట్టిన రోజా నియోజకవర్గానికి ఒక్క పరిశ్రమైనా తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారా అని భానుప్రకాష్ నిలదీశారు. గుంటలను పూడ్చి పార్కుల నిర్మాణానికి భూమిపూజ చేయడం కూడా ఒక అభివృద్ధేనా అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. చంద్రబాబు ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ఆత్మగౌరవానికి ప్రతీకలను కొనియాడారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలబడాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జి ఉమాశంకర్‌రెడ్డి, కృష్ణకుమార్, చెంచయ్య, హనుమంతునాయుడు, శంకరాచ్చారి, చందు, శేఖర్, రామూయాదవ్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణపురంలో స్థానికురాలిని అడిగి సమస్యలు తెలుసుకుంటున్న గాలి భానుప్రకాష్

శ్రీకాళహస్తి
సత్యవేడు

కిలో మీటరు నడిస్తేనే నీరు



మీరు చూస్తున్న ఈ చిత్రంలో ఉన్న మహిళలు బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని పీవీకండ్రిగ గ్రామానికి చెందిన వారు. ఈ గ్రామంలో తాగునీటి మోటారు పాడై నెలరోజులు దాటి పోయింది. అప్పటి నుంచి తాగునీటి కోసం కిలోమీటరు దూరంలో ఉన్న కృష్ణా పురం గిరిజన కాలనీకి వెళు తున్నారు. అక్కడి నుంచి ఇలా తెచ్చుకుంటున్నారు. అధికారులు, సర్పంచ్‌కు తెలియజేసినా ఫలితం లేకపోవడంతో ఈ పరిస్థితి ఉందని మహిళలు వాపోతున్నారు. - బుచ్చినాయుడుకండ్రిగ

16మందిపై కేసు నమోదు

తొట్టంబేడు, ఫిబ్రవరి 4: మండలంలోని చిన్నకనపర్తి గ్రామంలోని పంటపొలాల్లో కోడిపందేలు ఆడుతున్నట్లు 16 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3350 నగదు, నాలు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రాఘవేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జనసేన జెండా ఆవిష్కరణ, బైక్ ర్యాలీ



కేవీబీపురం, ఫిబ్రవరి4: మండలంలోని గుంటిపేడు, అంజూరు గ్రామాలలో ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి లావణ్య కుమార్, మండల అధ్యక్షుడు థామస్, ఉపాధ్యక్షుడు మోహన్ ఆధ్వర్యంలో జనసేన జెండాను ఎగుర వేశారు. గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో జనసేన- టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడు మండలాల నాయకులు రూపేష్, హేమసుందర్, చిరంజీవి, మునిశేఖర్, మధుబాబు, హరిప్రసాద్, మణికంఠయ్య, విజయ్‌కుమార్, స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరే కోనలో మద్యం సేవించరాదు



కేవీబీపురం, ఫిబ్రవరి4: ఆరే కోనలో మద్యం సేవించ రాదని ఎస్‌ఐ సునీల్ తెలిపారు. ఆదివారం కోనకు వెళ్లే పర్యాటకుల వాహనాలను ఎస్‌ఐ తన సిబ్బంది తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి కొలనులో దిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ లోకనాథం, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సెంట్రింగ్ మేస్త్రీకి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన రాజా

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4: రోడ్డు ప్రమాదంలో రాజా (60)అనే సెంట్రింగ్ మేస్త్రి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవనగర్ వద్ద ఆదివారం రాత్రి పిచ్చాటూరు రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. శ్రీకాళహస్తిలోని పోలీస్ క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన రాజా సెంట్రింగ్ మేస్త్రీ. రాజీవ్‌నగర్ కాలనీలో పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో రాజీవ్‌నగర్ వద్ద గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది. గాయపడిన రాజాను అటుగా వెళుతున్న వాహనదారులు గుర్తించి చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రూయకు రెఫర్ చేశారు.

మూర్ఛవ్యాధితో తమిళనాడు వాసి మృతి



సురేష్ మృతదేహం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4: మూర్ఛ వ్యాధితో తమిళనాడు వాసి మృతిచెందిన ఘటన ఆదివారం శ్రీకాళహస్తిలోని బీపీ అగ్రహారంలో చోటుచేసుకుంది. బంధువులు కథనం మేరకు.. తమిళనాడుకు చెందిన సురేష్ (25) ఇటీవల కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో చికిత్స పొందుతున్నాడు. విశ్రాంతి కోసం రెండు రోజుల క్రితం అమ్మమ్మ వల్లెమ్మ ఇంటికి వచ్చాడు. ఆదివారం రాత్రి ఇంట్లో స్నానం చేస్తుండగా మూర్ఛ రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 4: వరదయ్యపాళెం మండలంలోని గోవర్ధనపురం ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 50మంది వైద్యపరీక్షలు చేయించు కున్నారు. 25 మంది ఆపరేషన్లకు ఎంపికయ్యారు. వారికి శంకర్ నేత్రాల యలో ఆపరేషన్లు చేసి తిరిగి ఇంటి వద్ద చేర్చనున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకటముని, శరవణన్, అరవింద్, ప్రముఖులు సుబ్రహ్మణ్యం, మావుడూరు మోహన్, తొండమనాటి నాగప్రసాద్, రామ సుబ్బయ్య, గుణవర్ధన్, మోహన్‌రావు, గోపి, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా రోడ్డు మరమ్మతులు



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 4: వరదయ్యపాళెం మండల కేంద్రంలో తూతూ మంత్రంగా రోడ్డుమరమ్మతు పనులు చేస్తున్నారు. పాలకులు, అధికారులకు నాలుగున్నర సంవత్సర కాలంలో గుర్తుకు రాని రోడ్లు ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావుడిగా మొదలుపెట్టారు. మండల వ్యాప్తంగా రోడ్లు ఎపుడో దీనస్థితికి చేరాయి. ఆయా గ్రామాల ప్రజలు రోడ్లు బాగు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకుంటూనే ఉన్నారు. అయినా పిడికెడు మట్టి వేసిన పాపాన పోలేదు. ఇక మిచౌంగ్ తుఫాను వల్ల మండలంలోని అంబూరు నుంచి సంతవేలూరు రహదారి వరదయ్యపాళెం నుంచి పాండూరు రహదారి, పాండూరు సిద్దేశ్వరపురం నుంచి కుప్పదు తగేలి, అలాగే గోవర్ధనపురం కాలువ, వంతెన పూర్తిగా దెబ్బతింది. వీటిని మాత్రం ఇంతవరకు పట్టించుకోలేదు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఏదో తట్టెడు మట్టి పోశామా అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

వైసీపీ ఓటమితోనే సమాజ శాంతి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4: వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడిస్తేనే సమాజ శాంతి లభిస్తుందని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని ముచ్చువోలు పంచాయతీలో ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రబాబు, రాఘవయ్య గణేష్, శివకుమార్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 4: ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవాధ్యక్షులు చిన్నిరాజ్ అన్నారు. ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన రూ.1,450కోట్ల సంక్షేమ నిధుల్లో రూ.1,300కోట్లు దారి మళ్లిం చారన్నారు. ఫలితంగా కార్మికులకు అందాల్సిన ప్రమాదబీమా, పెళ్లి, ప్రసూతి, తదితర సంక్షేమ పథకాలు కార్మికులకు అందలేదన్నారు. వెంటనే సంక్షేమ బోర్డుకు నిధులు జమచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు, కోటేశ్వరరావు, చంద్ర, సుబ్రహ్మణ్యం, యూసఫ్‌బాయి, భవన నిర్మాణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ప్రజా సంక్షేమం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4: టీడీపీ నాయకులు రిషితారెడ్డి శ్రీకాళహస్తి మండలంలోని మద్దిలేడు, జింగిలిపాళెం, జింగిలిపాళెం ఎస్టీకాలనీల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు జంగాలపల్లి తులసిరామిరెడ్డి, మండల అధ్యక్షులు కామేష్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి బత్తిరెడ్డి, యూనిట్ నాయకులు బత్తెయ్య, చెంచయ్యనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల తనిఖీ

ఏర్పేడు, ఫిబ్రవరి 4: ఏర్పేడు ఎస్‌ఐ జిలాని ఆదివారం సాయంత్రం పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారితో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. కోబాక గ్రామం నుంచి రాజులపాళెం వెళుతున్న హరి అనే యువకుడు మద్యం తాగి ద్విచక్ర వాహనాన్ని నడుపుతుండటంతో అతనిపై కేసు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని వాహనదారులకు సూచించారు.

40 శాతం నామినేటెడ్ పదవులు బీసీలకు: టీడీపీ





సమావేశంలో పాల్గొన్న ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ● మాట్లాడుతున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, ఫిబ్రవరి 4: శ్రీకాళహస్తి నియోజవర్గంలో 40 శాతం నామినేటెడ్ పదవులు బీసీలకు కేటాయిస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని తొండమాను పురంలో జయహో బీసీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ బీసీలకు అత్యున్నత స్థానం కల్పించిన ఘన నియోజకవర్గంలో బొజ్జల గోపాలక్రిష్ణారెడ్డికి, రాష్ట్రంలో చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ బీసీలకు రక్షణగా నిలుస్తానన్నారు. బీసీ జనాభా రోజురోజుకూ పెరుగుతుంటే జగన్‌రెడ్డి మాత్రం వారికిచ్చే రిజర్వేషన్ శాతాన్ని తగ్గిస్తూ సవతి ప్రేమ చూపుతు న్నారని విమర్శించారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా బతుకుతున్న ఎమెల్యే బియ్యపు మదుసూదన్‌రెడ్డికి రానున్న ఎన్నికలు బీసీలంతా గుణపాఠం చెప్పాలని కోరారు. తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మండల అధ్యక్షుడు కామేష్‌యాదవ్, బీసీ సెల్ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, రాష్ట్రకార్యదర్శులు రెడ్డివారి గురవారెడ్డి, చెంచయ్యనాయుడు, బత్తిరెడ్డి, పాపిరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, దశరథాచారి, నాయకులు దొరైరాజ్‌రెడ్డి, ఉమేష్, ఎంఎస్‌రెడ్డి, విజయలక్ష్మి, వాణి, కృష్ణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది ఉమ్మడి ప్రభుత్వమే : జేడీ



జేడీఆర్ బైక్ ర్యాలీ

నాగలాపురం, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో టీడీపీ - జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని టీడీపీ నేత జేడీ రాజశేఖర్ పేర్కొన్నారు. ఇటీవల నాగలాపురం నుంచి పీవీ పురం వరకు నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోని రోడ్లను జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తన సొంత నిధులతో బాగుచేయించారు. రోడ్డుకు గ్రావెల్ తోలి మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను ఆదివారం పెద్దఎత్తున సన్మానించారు. ఈ సందర్భంగా టీపీ కోట నుంచి నాగలాపురం వరకు జేడీ రాజశేఖర్ తన అనుచరులు, మద్దతుదారులతో కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలాపురంలోని ఆర్ఎంఆర్ కళ్యాణ మండపం లో జరిగిన సన్మాన సభలో ఆయన మాట్లా డుతూ మరో 80 రోజుల్లో రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం రానుందన్నారు. రాష్ట్రానికి పట్టిన జగన్ గ్రహణం వీడనుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని రోడ్లకు మహర్దశ పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగలాపురం నాయకులు ప్రసాద్‌రాజు, ప్రేమా సెల్వకుమార్, యాచేంద్రనాయుడు, వెంకటేష్, చంద్రరాజు, సుబ్రహ్మణ్యం రాజు, రోశయ్య రాదయ్య, వాసు, హేమభూషణం, గోవింద స్వామి, కోనయ్య తదితరులు పాల్గొన్నారు.

దళిత ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దగ్ధం..దళిత జాతికే అవమానం



నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు

నాగలాపురం, ఫిబ్రవరి 4: దళిత ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దగ్ధం దళిత జాతికే అవమానమని పలువురు యువకులు పేర్కొన్నారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దిష్టిబొమ్మను సొంత పార్టీ నాయకులే ఇటీవల దగ్ధం చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆదివారం పిచ్చాటూరు మండలంలోని యువకులు స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిమూలానికి అన్యాయం జరిగితే అడ్డుకోవాల్సిన దళితలు ఆయన దిష్టి బొమ్మలను దగ్ధం చేయడం అత్యంత దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది నాగరాజ్ పాండియన్, రుకేష్, ఎమ్మెస్ రవి. ఎంరవి, ఏకాంబరం, శైలేషన్, జామవా, రమేష్ పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో బీజేపీ నేత



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4: శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని ఆదివారం బీజేపీ జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి దర్శించుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మ వార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద ఆశీర్వాదం పొందారు. అనంతరం శేషా వస్త్రంతో సత్కరించి స్వామి అమ్మవార్ల చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

టీడీపీలోకి వలసల జోరు



ఏర్పేడు, ఫిబ్రవరి 4: ఏర్పేడు మండలం నచ్చనేరి గ్రామం నుంచి 50మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రామచంద్రారెడ్డి, రమణయ్య, మహేష్, గుర వయ్య, భాస్కర్, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, మోహన్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, గోపాల్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు. అదే విధంగా మర్రిమంద గ్రామం నుంచి అత్తూరు కేశవరెడ్డి ఆధ్వర్యంలో 30మంది యువకులు టీడీపీలో చేరారు. పార్టీలో చేరినవారిలో శేఖర్, మురగేష్, భాను, సాదిక్, నజీర్, పాండురంగ, త్యాగరాజు, ప్రసన్నకుమార్, రవి, నరేంద్ర, నంద, లీల, కరీముల్లా, శశి, శివ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నారావు, నాయకులు ధనంజయులనాయుడు, నాగరాజునాయుడు, సీతాపతి ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భద్రత కట్టుదిట్టం : చైర్మన్



భద్రతా సిబ్బందితో మాట్లాడుతున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4: ముక్కంటి ఆలయ భద్రతపై చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆదివారం అధికారులతో సమీక్షించారు. మూడు రోజుల క్రితం ఓ బాలుడు ఆలయ ప్రాకారాన్ని దాటడంతో భద్రతా వైఫల్యంపై దుమారం రేగిన విషయం తెలిసిందే. దీనిపై ఆలయ చైర్మన్ అధికారులతో చర్చించారు. మూడంచెల భద్రతను మరింత కట్టుదిట్టం చేసేలా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆలయంలో ఫ్లడ్ లైట్లు, నాలుగు ప్రవేశ గోపురాలు వద్ద వాచ్ టవర్లు, సిబ్బంది మధ్య సమాచార వ్యవస్థను మెరుగు పరిచేందుకు అదనంగా 30 వైర్లెస్ సెట్లు, ప్రవేశ ద్వారాల వద్ద నిరుపయోగంగా ఉన్న దుకాణాల తొలగింపు, సుపధ మండపం తూర్పు వైపున గోడకు ఫెన్సింగ్ నిర్మాణం, ఆలయ శిఖరాలకు ఫోకస్ లైట్లు, అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు, రాత్రి పహారాకు అదనపు సిబ్బంది నియామకం చేయనున్నట్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ నాగభూషణం, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, సెక్యూరిటీ ఇన్‌చార్జి మణి, ఎస్పీఎఫ్, ఏఆర్ పోలీసులు, హోంగార్డులు, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బదిలీ వేటుకు తర్జనభర్జన

బాలుడు అర్ధరాత్రి శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రాకారం దాటడంలో ముమ్మాటికి భద్రతా వైఫల్యమే కారణమని అధికారులు తెలిపినట్లు సమాచారం. ఈ ఘటనపై శనివారం అధికారుల బృందం రహస్యంగా విచారించింది. భద్రత డొల్లతనంపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. కొందరు ఉద్యోగులపై బదిలీ వేటు వేసేందుకు తర్జనభర్జన పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

దేవాంగులకు సీట్లు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవాంగ సంఘం నాయకులు

సత్యవేడు, ఫిబ్రవరి 4: రానున్న ఎన్నికల్లో దేవాంగ సామాజిక వర్గం ఓటింగ్ శాతం అధికంగా ఉన్న స్థానాల్లో దేవాంగ కులస్తులనే అభ్యర్థులుగా ప్రకటించి అవకాశం కల్పించాలని రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మన్నె ముద్దు శ్రీనివాసులు రాష్ట్రంలోని అన్ని పార్టీలను కోరారు. సత్యవేడు ప్రెస్‌క్లబ్‌లో స్థానిక దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇది విషయంపై మంగళగిరిలో జరిగిన దేవాంగ ఆత్మగౌరవ సభకు పలువురు మద్దతు తెలియజేశారని అన్నారు. చీరాల, రాజమండ్రి రూరల్, హిందూపురం(ఎంపీ), పుట్టపర్తి వంటి అసెంబ్లీ నియోజకవర్గాల్లో దేవాంగ సామాజిక వర్గం అధికంగా ఉందన్నారు. గతంలో రాజమండ్రి రూరల్‌లో చందన రమేష్, చీరాలలో దివంగత చంద్రమౌళి, పుట్టపర్తిలో నిమ్మ కిష్టప్ప తదితరులు తమ సామాజిక వర్గానికి చెందిన వారే ఎమ్మెల్యేలుగా గెలిచారని ఆయన గుర్తుచేశారు. ఇదే తరహాలో హిందూపురం ఎంపీ స్థానాన్ని దేవాంగ కులస్తులకు కేటాయించాలని కోరారు. సత్యవేడు దేవాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బండారు మోహన్‌బాబు, రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యుడు యారాశి మురళీకృష్ణ, స్థానిక దేవాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు మన్నే గణపతి, ఆర్గనైజర్ సెక్రటరీ మన్నే ఉదయ్‌కుమార్, ఉమ్మిటి బాలగురప్ప, జక్కుల శివానందం, మన్నె దొరబాబు, ఉమ్మిటి సుబ్రహ్మణ్యం, దేవాంగ సంఘం మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల యుద్ధానికి ఏర్పేడు సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు, ఫిబ్రవరి 4: సార్వత్రిక ఎన్నికల యుద్ధానికి ఏర్పేడు మండలం సిద్ధమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఏర్పేడు మండల నాయకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి ఏర్పేడు మండలంలో బియ్యపు పవిత్రారెడ్డి ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. పార్టీ గెలుపుకోసం అంతా సిద్ధంగా ఉండాలని తెలియజేశారు.

సచివాలయం ఉన్నా..సేవలు సున్నా..!



9వ వార్డు సచివాలయ భవనం

- ●చోరీకి గురైన కంప్యూటర్ పరికరాలు
- ●ప్రత్యామ్నాయం చూపని అధికారులు
- ●నాలుగు నెలలుగా ప్రదక్షిణలు చేస్తున్న లబ్ధిదారులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4: శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో 35 వార్డులు ఉన్నాయి. సుమారు ఒక లక్ష మంది జనాభా పట్టణంలో నివసిస్తున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శ్రీకాళ హస్తిలో 22 వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశారు. వాటిలో 9వ వార్డు సచివాలయం ఒకటి. ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా అయ్యలనాడు చెరువులో ఉన్న తుడా భవనంలో ఈ సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆకతా యిలు రాత్రయితే సచి వాలయ పరిసరాల్లో మద్యం సేవించేవారు. తరచూ అర్ధరాత్రి ఓ ఆటో డ్రైవర్ సచివాలయం వద్ద మద్యం సేవించేవాడు. అదే ఆటో డ్రైవర్ నాలుగు నెలల క్రితం అర్ధరాత్రి సచివాలయం లోని కంప్యూటర్ పరికరాలను దోచుకెళ్లాడు. మరుసటి రోజు సచివాలయ సిబ్బంది శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాలు ఆధారంగా రామచంద్రా పురం గ్రామానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ చోరీ చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. ఆ ప్రకారం వారం రోజు ల్లోనే చోరీ జరిగిన పరికరాలను స్వాధీనం చేసుకుని దొంగను అరెస్టు చేశారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు నిల్

చోరీ జరిగిన తర్వాత అధికా రులు సచివాల యంలో కంప్యూ టర్ పరికరాల ఏర్పాట్లపై దృష్టి సారించలేదు. పురపాలక సంఘం నుంచి నిధులు మంజూరు చేయ లేదు. వేరే సచి వాల యంలో నుంచి పరికరాలను సర్దుబాటు కూడా చేయలేదు. సాధారణంగా కేసుల్లో నమోదైన వాహనాలు, పరికరాలను రిటర్న్ ఆఫ్ ప్రాపర్టీ కింద అధికారులు న్యాయస్థానం ద్వారా తిరిగి పొందవచ్చు. ఆ ప్రక్రియ ద్వారా కూడా అధికారులు పరికరాలను తిరిగి సచివాలయానికి చేర్చలేకపోతున్నారు.

స్తంభించిన సేవలు..

చోరీ జరిగినప్పటి నుంచి 9వ వార్డు సచివాలయంలో లబ్ధిదారులకు అందించే సేవలు స్తంభించిపోయాయి. నాలుగు నెలల క్రితం రేషన్ కార్డులు మంజూరైన లబ్ధిదారులు ఉన్నారు. పరికరాలు లేకపోవడంతో కార్డులు ప్రింట్ తీసివ్వలేని పరిస్థితి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి 9వ వార్డు సచివాలయంలో పరికరాల సమస్యను పరిష్కరించాలని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ● ఇదిలా ఉండగా పట్టణ వ్యాప్తంగా సచివాలయాల్లో ప్రభుత్వ గుర్తుతో ముద్రించిన ఖాళీ రేషన్ కార్డుల కొరత వెంటాడుతున్నట్లు సమాచారం.